# ప్రజా తపన
prajathapana.com
News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 98 బుధవారం 31 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## ప్రజల జీవితాలను మెరుగుపరచాలన్న ఆకాంక్షే ఈ తొమ్మిదేళ్ల పాలన

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే తొమ్మిదేళ్ల పాలనలో తీసుకున్న ప్రతి నిర్ణయం, చేసిన ప్రతి పని ప్రజల జీవితాలను మెరుగుపరచేందుకేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దేశ సేవలో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్నందుకు తన మనసు అణకువ, కృతజ్ఞతలతో నిండిపోయిందన్నారు. మోదీ రెండోసారి ప్రధాన మంత్రిగా 2019 మే 30న ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.మోదీ మంగళవారం ఇచ్చిన ట్వీట్‌లో, దేశ సేవలో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్నామని, తన మనసు అణకువ, కృతజ్ఞతలతో నిండిపోయిందని తెలిపారు. ప్రజల జీవితాలను మెరుగుపరచాలనే ఆకాంక్షే ఈ తొమ్మిదేళ్లలో తన ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయానికి, చేసిన ప్రతి పనికి మార్గదర్శకమని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించేందుకు తాము మరింత శ్రమించి కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో సాధించిన అభివృద్ధిని వివరించారు. దేశాభివృద్ధి కోసం తొమ్మిదేళ్లపాటు సడలని పట్టుదలతో, అంకితభావంతో కృషి చేసినట్లు చెప్పారు.



02




## ఏడో తేదీన ఏపీ కేబినెట్



**ప్రజా తపన ,విజయవాడ:**

ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. మొదటి రోజు నీతి ఆయోగ్ సమావేశం, రెండో రోజు పార్లమెంట్ భవన ప్రారంభోత్సవలో పాల్గొన్నారు. మూడో రోజు సోమవారం ఆయన అధికారికంగా ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నారో స్పష్టత లేదు కానీ.. ప్రభుత్వ వర్గాల నుంచి ఏడో తేదీన కేబినెట్ భేటీ అనే సమావేశం అనే సమాచారం మాత్రం బయటకు వచ్చింది. సీఎం జఘన్ ఢిల్లీలో ఉన్న సమయంలోనే హడావుడిగా కేబినెట్ భేటీ ఏర్పాటు చేయడంతో కీలక నిర్ణయాలు తీసుకుంటారన్న ప్రచారం ప్రారంభమయింది. కీలక నిర్ణయాలు అంటే.. పథకాల గురించి.. వాటి అమలు గురించి ఇప్పటికి ఏ నిర్ణయం తీసుకున్నా కీలకం కాదు. కీలక నిర్ణయమంటే ముందస్తు ఎన్నికలే. ఎన్నికల సంఘం ఏపీ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలు ప్రారంభించింది. ఇందు కోసం సమీక్షలు చేస్తోంది. కావాల్సిన సమాచారం సేకరిస్తోంది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు జరగాల్సిన ఏపీ

02

## మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరిస్తాం

**ప్రజా తపన ,ఇంఫాల్ :**

అల్లర్లు, హింసాకాండతో అట్టుడికిన మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు పౌర సంస్థలు, మహిళా నేతల బృందంతో మంగళవారంనాడు ఆయన సమావేశమయ్యారు.

సమావేశానంతరం మీడియాతో అమిత్‌షా మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణకు, అభ్యుదయ పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని,

02




## మనీశ్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

### బెయిలు ఇచ్చేందుకు నిరాకరణ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మనీశ్ సిసోడియా కు బెయిలు ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం నిరాకరించింది. సీబీఐ దాఖలు చేసిన ఈ కేసులో ఆయన సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని కోర్టు తెలిపింది. జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ ఈ తీర్పు ఇచ్చారు..సీబీఐ దాఖలు చేసిన ఢిల్లీ మద్యం కుంభకోణం



కేసులో మనీశ్ సిసోడియాకు బెయిలు ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. సిసోడియా పలుకుబడిగల నేత అని, ఆయన అధికారులను ప్రభావితం చేయగలిగే స్థితిలో ఉన్నారని, సాక్షుల్లో ఎక్కువ మంది ప్రభుత్వోద్యోగులు కాబట్టి, వారిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. సిసోడియాపై ఆరోపణలు చాలా తీవ్ర స్వభావం కలవని తెలిపింది. సౌత్ గ్రూప్ చెప్పినట్లుగా దురుద్దేశంతో ఈ మద్యం విధానాన్ని రూపొందించారని, సౌత్ గ్రూప్‌నకు అనుచిత ప్రయోజనాలను కలిగించే విధంగా దీనిని రూపొందించారని వచ్చిన ఆరోపణలు చాలా తీవ్ర స్వభావం కలవని తెలిపింది. సాక్షులను ప్రభావితం చేస్తారనే అంశాన్ని తోసిపుచ్చలేమని తెలిపింది. సిసోడియా, సీబీఐ వాదనలను విన్న తర్వాత మే

02

## దీపావళి కథల పోటీ- 2023

**ప్రజా తపన.**

https://www.prakasika.org/

గురజాడ ఫౌండేషన్ (అమెరికా) వారిచే ప్రచురింపబడుతున్న చారిత్రాత్మక త్రైమాస
అంతర్జాల తెలుగు పత్రిక 'ప్రకాశిక' ((https://www.prakasika.org/ ) ) నిర్వహిస్తున్న 2023 దీపావళి కథల పోటీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారినుంచి రచనలను ఆహ్వానిస్తున్నాము.

ప్రథమ బహుమతి : రూ. 1,500
ద్వితీయ బహుమతి : రూ. 1,000
తృతీయ బహుమతి : రూ. 500

మీ రచన మీద సర్వహక్కులూ మీవే. కానీ దయచేసి ఇంకెక్కడైనా పరిశీలనలో ఉన్న కథలు, ఇది వరలో ప్రచురించబడిన రచనలు మరో రూపంలోనూ పంపంచవద్దు.

మీ రచన చివరలో అది మీ స్వంత రచన అనీ, దేనికీ అనుకరణ, అనుసరణ కాదని, మరే ఇతర సామాజిక మాధ్యమాలలోనూ, అంతర్జాల పత్రికలలోనూ ప్రచురితం కాలేదని, అలాగే పరిశీలనలో కూడా లేదని హామీ పత్రం విధిగా జతపరచాలి.

మీ రచనలలో ఎవరినీ కించపరిచే వ్యాఖ్యలుగానీ, విమర్శలుగానీ ఉండకూడదు.

ఆన్లైన్ లో సమర్పించిన రచనలు మాత్రమే పరిశీలించబడతాయి.

మీ రచన పంపించే ముందు అచ్చుతప్పులు సరి చేసి పంపించండి. ఒకటికి పది సార్లు చదివి తప్పులు సవరించండి.

⇨ కథల నిడివి 900 పదాలకి మించకూడదు.

⇨ బహుమతి పొందిన, మరియు సాధారణ ప్రచురణకు ఎంపికైన కథలు 'ప్రకాశిక' అంతర్జాల త్రైమాస పత్రికలో ప్రచురితమవుతాయి.

⇨ నిర్దేశిత కథల పోటీ గడువును పొడిగించేందుకు గానీ, పరిశీలనకి వచ్చిన కథల అర్హతను బట్టి బహుమతులలో మార్పులు చేసేందుకు గానీ నిర్వాహకులకి అన్ని హక్కులు ఉన్నాయి.

⇨ ఒకరు ఒక కథ మాత్రమే సమర్పించాలి. కథల ఎంపికలో తుది నిర్ణయం నిర్వాహకులదే.

⇨ ప్రచురణకి సంబంధించిన అన్ని విషయాలలో సర్వ నిర్ణయాధికారాలూ పత్రిక సంపాదకులవే.

వివరాలకు సంప్రదించవలసిన ఈ- చిరునామా: editor@prakasika.org

కథలు పంపించడానికి చివరి రోజు: 15 ఆగష్టు 2023

# గుంతకల్ కేంద్రంగా కొత్తజిల్లా ఏర్పాటు చేయాలి

**ప్రజా తపన ,గుంతకల్**



గుంతకల్ కేంద్రంగా కొత్తజిల్లా ఏర్పాటు చేయా లని రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో గుంతకల్ డిప్యూటీ తహశీల్దార్ కి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నాలుగు జిల్లాలను8 జిల్లాల గా విభజించారు న్యాయంగా విస్తీర్ణం ప్రకారం12 జిల్లాలు చేయాలి కావున వెంటనే 12 జిల్లాలుగా పునర్విభజన చేసి కోస్తా ప్రాంతానికి సమానంగా అసెంబ్లీ సీట్లను పెంచాలన్నారు.
ఇప్పటికే తీవ్ర కరువుజిల్లా అయిన అనంతపురంని ఇంకో జిల్లా గుంతకల్ కేంద్రంగా ఏర్పాటు చేసిప్రత్యేక వసతులతో ఆసుపత్రులు యూనివర్సిటీ లు ఏర్పాటు చేయాలన్నారు.ఇప్పటికే రెవెన్యూ డివిజన్ అయిన గుంతకల్ ని జిల్లా కేంద్రంగా చేసి అభివృద్ధి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు కాశి రావు,జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు, ఆదినారాయణ, లాలస్వామి, మహేష్,అ దెన్న, కృష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాలను మెరుగుపరచాలన్న ఆకాంక్షే ఈ తొమ్మిదేళ్ల పాలన

(మొదటిపేజీ తరువాయి)

**పేదల సంక్షేమం : అమిత్ షా**
కేంద్ర హోం మంత్రి, బీజేపీ నేత అమిత్ షా ఇచ్చిన ట్వీట్‌లో, నేడు ఓ వైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉందని, ప్రపంచంలో దేశం హోదా సమున్నత స్థాయికి చేరుతోందని; మరోవైపు ప్రభుత్వానికి అభివృద్ధి, పేదల సంక్షేమం పట్ల నూతన లక్ష్యాలు ఉన్నాయని చెప్పారు.

**ప్రజలపై నమ్మకం : నిర్మల సీతారామన్**
మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను కేంద్ర మంత్రులు కూడా ప్రశంసించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సోమవారం ముంబైలో మాట్లాడుతూ, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సాధించిన విజయాలను, అమలు చేస్తున్న సంస్కరణలను వివరించారు. ప్రస్తుతం పన్నుల విధానాన్ని ఫేస్‌లెస్ చేశామని, దీనికి కారణం ప్రజలపై తమకు నమ్మకం ఉండటం, ప్రజలకు మోదీపై నమ్మకం ఉండటం అని చెప్పారు.

అభివృద్ధిలో నూతన అధ్యాయం : షెకావత్
కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సోమవారం మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్లలో వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడంలో నూతన అధ్యాయాన్ని రాసిందన్నారు. భారత దేశ పేరు, ప్రఖ్యాతులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయన్నారు. దేశ భద్రత, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. పేదలకు ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సురక్షిత తాగునీటిని కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని, మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టర్ అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నామన్నారు.

# మనీశ్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

11న ఈ తీర్పును రిజర్వు చేసిన సంగతి తెలిసిందే.ఈ కుంభకోణం కేసులో సీబీఐ ఛార్జిషీటులో మనీశ్ సిసోడియాను నిందితునిగా పేర్కొన్న సంగతి తెలిసిందే. రెండు ఫోన్లను తాను ధ్వంసం చేసినట్లు సిసోడియా అంగీకరించారని అనుబంధ ఛార్జిషీటులో సీబీఐ తెలిపింది.మనీశ్ సిసోడియాను సీబీఐ ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. ఆయన ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. సీబీఐ కేసులో ఆయన బెయిలు దరఖాస్తును స్పెషల్ జడ్జి మార్చి 31న తిరస్కరించారు. ఈడీ కేసులో ఆయన బెయిలు దరఖాస్తును ట్రయల్ కోర్టు ఏప్రిల్ 28న తోసిపుచ్చింది. ఈడీ కేసులో ఆయన బెయిలు దరఖాస్తు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.సీబీఐ కేసులో రెగ్యులర్ బెయిలు కోసం దరఖాస్తు చేసిన సిసోడియా డబ్బుకు సంబంధించిన ఆధారాలేవీ దొరకలేదని వాదించారు. అయితే సీబీఐ వాదనలు వినిపిస్తూ, ఇది చాలా లోతుగా పాతుకుపోయిన కుట్ర అని తెలిపింది. అనేక అంచెలుగా కుట్ర జరిగిందని, దీనిని బయటపెట్టేందుకు సిసోడియా సహకరించడం లేదని తెలిపింది. దర్యాప్తులో తప్పించుకునేందుకు ప్రయత్నించారని తెలిపింది. కార్యనిర్వాహక శాఖ, ప్రభుత్వోద్యోగులతో సిసోడియాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని కొనసాగిస్తున్నారని తెలిపింది. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సిసోడియా బాధితుడని ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారని, దర్యాప్తును ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది.ఈడీ చేసిన ఆరోపణల ప్రకారం, ఢిల్లీ మద్యం విధానం రూపకల్పన, అమలులో అవినీతి జరిగింది. ప్రైవేటు కంపెనీలకు 12 శాతం లాభాలు ఇచ్చే విధంగా కుట్ర పన్ని దీనిని రూపొందించి, అమలు చేశారు. మంత్రుల బృందం సమావేశాల్లో చర్చనీయాంశంగా దీనిని పేర్కొనలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాల తరపున విజయ్ నాయర్ ఈ కుట్రను సమన్వయపరిచారు.తెలంగాణ ఎమ్మెల్సీ కవితను ఈ కేసులో ఈడీ ప్రశ్నించింది. ఇటీవల ఛార్జిషీట్లలో ఆమె పేరు లేదని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు కీలక నిందితులు అప్రూవర్లుగా మారి, దర్యాప్తు సంస్థలకు సహకరించే అవకాశాలు కనిపిస్తున్నాయని తాజా సమాచారం.

# ఏడో తేదీన ఏపీ కేబినెట్

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికలపై ఇప్పుడు ఎందుకు సన్నాహాలు అనే అనుమానం చాలా మందికి వచ్చింది.దీంతో ఎక్కువ మంది జగన్ .. తెలంగాణతో పాటు ముందస్తుకు వెళ్లడానికి సిద్ధమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. నవంబర్‌లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్ రావాల్సి ఉంది. అదీ కూడా మొదటి వారంలోనే వస్తుంది. అంటే.. ఎన్నికల సంఘం ఆ ఐదు రాష్ట్రాలతో కలిపి ముందస్తు ఎన్నికలు జరపాలంటే? కనీసం నాలుగైదు నెలల ముందు అసెంబ్లీని రద్దు చేయాలి. లేకపోతే ఈసీ సన్నాహాల కోసం మరికొంత సమయం తీసుకుంటుంది. అంటే ముందస్తు ఎన్నికలు పెట్టాలంటే ఇప్పుడు అసెంబ్లీని రద్దు చేయాల్సి ఉంటుంది. ముందస్తుకు వెళ్లాలంటే కేంద్రం సహకారం తప్పని సరి. కేంద్రం కాదంటే జరిగే చాన్స్ లేదు. ఆరు నెలల ముందు అసెంబ్లీని రద్దు చేసినా కేంద్రం కాదంటే మాత్రం.. రాష్ట్రపతి పాలన అయినా విధిస్తారు కానీ ఎన్నికలు నిర్వహించరు. అయితే ఈ అంశంలో జగన్మోహన్ రెడ్డికి కేంద్రం సపోర్ట్ లభిస్తోందని చెబుతున్నారు. గత కొంత కాలంగా ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాని మోదీకి ముందస్తుకు సహకరించాలన్న విజ్ఞప్తి చేశారని ఆయన మీ ఇష్టం అన్నారన్న ప్రచారం జరుగుతోంది. తాజాగా ఢిల్లీ పర్యటనలోనూ ఆయనకు ఈ అంశంపై స్పష్టత రావడంతో ఏడో తేదీన కేబినెట్ సమావేశం నిర్వహణకు సిద్ధమయ్యారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రభుత్వం ముందస్తుకు వెళ్లడానికి చాలా కారణాలు ఉన్నాయి. అందులో ఒకటి ఆర్థిక పరిస్థితులు. కేంద్రం ఇచ్చిన అప్పుల పరిమితి ఆరు నెలల వరకే వస్తుంది. ఆ తర్వాత కష్టం. నిధుల సమీకరణ ఇబ్బంది అవుంది.ఈ ఆరు నెలల పాటు పథకాలన్నీ అమలు చేయడానికి కావాల్సిన నిధులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో విపక్షాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. మహానాడులో అనూహ్యంగా ఆరు పథకాలను చంద్రబాబు ప్రకటించడంతో ఎన్నికల వాతావరణం వచ్చేసినట్లయింది. అయితే పొత్తులు ఇతర విషయాల్లో విపక్షాలు ముందడుగు వేయలేదు. వారు సన్నాహాలు పూర్తి చేయక ముందే ఎన్నికలు పూర్తి చేస్తే మేలని జగన్ భావిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. ముందస్తుకు వెళ్తారా లేదా అన్నదానిపై ఏడో తేదీన కేబినెట్ భేటీలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటించండి

**బద్వేలు**



సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బద్వేలు సిఐటియు పట్టణ కార్యాలయం వద్ద సిఐటియు పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ సిఐటియు 1970 వ సంవత్సరం మే 30వ తారీఖున కలకత్తా నగరంలో సిఐటియు ఆవిర్భవించింది అన్నారు. 53 సంవత్సరాలుగా కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిజాయితీగా నిక్కసిగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, పబ్లిక్ సెక్టార్ అమ్మేయడం, కార్మిక హక్కులు కాల రాయడం చేస్తున్నదని వారు ఆరోపించారు. రైల్వే బిఎస్ఎన్ఎల్ ,ఎల్ఐసి ,డిఫెన్స్, విశాఖ స్టీల్ ప్లాంట్, బ్యాంక్స్ వివిధ రకాల ప్రభుత్వ సంస్థలైన,రత్నం లాంటి కంపెనీలను అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఎప్పటికప్పుడు ఆందోళన చేస్తున్నదని, ఇప్పటివరకు కార్మికుల పక్షాన దాదాపు 26 దేశవ్యాప్త సమ్మెలు నిర్వహించిందని తెలిపారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం రెండు కలిపి కాంట్రాక్టు ఉద్యోగులను, స్కీం వర్కర్లను అన్యాయానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయడం పెన్షన్ సౌకర్యం లేకుండా చేయడం వారికి రక్షణ లేకుండా, భద్రత లేకుండా ఇబ్బందులు గురి చేయడం దారుణం అని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతు ఓబులేసు, పులి శ్యాం ప్రవీణ్, మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాలహరి, నాయకులు బద్వేల్ ప్రవీణ్, కిరణ్, వంశీ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడియము చిన్ని, పట్టణ నాయకులు ఎస్. ప్రవీణ్ కుమార్, హమాలి యూనియన్ నాయకులు వెంకటేష్, లింగయ్య, జయరాం, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, మహిళా సంఘం నాయకురాలు రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు.కల్లోలిత మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు జరుపుతున్న ప్రయత్నాల్లో భాగంగా మైతి, కుకీ వర్గాల ప్రతినిధులతో అమిత్‌షా మంగళవారంనాడు సమావేశం కానున్నారు. నాలుగు రోజుల మణిపూర్ పర్యటనలో భాగంగా సోమవారంనాడు ఇంఫాల్ చేరుకున్న హోం మంత్రి ఆ వెంటనే ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్, ఆయన క్యాబినెట్ మంత్రులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి, ఇంతవరకూ తీసుకున్న చర్యలను ఆయన సమీక్షించారు.కాగా, రక్షణ సిబ్బంది చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుగూ, మణిపూర్‌లో తలెత్తిన సవాళ్లు ఇంకా సమసిపోలేదని, సమస్యలు పరిష్కారానికి మరికొంత సమయం పడుతుందని చెప్పారు. ఇయితే ఈ ఘటనలు తిరుగుబాటుకు సంబంధించిన ఘటనలు కావని తెలిపారు. మే 3న మైతీ, కుకీ తెగల మధ్య తలెత్తిన ఘర్షణలు హింసాత్మకంగా మారారు. 80 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది ఇళ్లు విడిచిపెట్టి సహాయక శిబిరాలకు తరలివెళ్లారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు కేంద్ర బలగాలు కొద్దికాలంగా రాజధాని నగరంలోనూ, అల్లర్లకు అవకాశం ఉన్న ప్రాంతాల్లోనూ మోహరించాయి.

# ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పై చర్య తీసుకోవాలని ధర్నా

**న్యూఢిల్లీ:**

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అరిజిన్?డెయిరీ నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదం దేశ రాజధాని ఢిల్లీకి చేరింది. లైంగిక వేధింపులకు పాల్పడిన దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ డెయిరీ సీఈవో ఆదినారాయణ, సీఏవో శేజల్?ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఫ్లెక్సీని ప్రదర్శించారు. తనపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లు శేజల్ తెలిపారు. దుర్గం చిన్నయ్య వల్ల తమ కంపెనీలో ఉన్న వాళ్లంతా రోడ్డున పడ్డారని బాధితురాలు శేజల్ ఆరోపించారు. ఎమ్మెల్యే తమను లైంగికంగా వేధిస్తున్నారని.. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని పేర్కొన్నారు. ఇప్పటికే మాపై తప్పుడు కేసులు పెట్టారని.. బెయిల్‌పై బయటకు వచ్చినా, బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ అపాయింట్మెంట్ అడిగానని.. ఎందుకో ఇవ్వడం లేదంటూ శేజల్ ఆరోపించారు.దుర్గం చిన్నయ్యకు వ్యతిరేకంగా జంతర్ మంతర్‌లో ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తానని.. తనలాగే ఎంతోమంది బాధితులున్నారని శేజల్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే పెద్ద ఉమనైజర్ అని.. ఆధారాలన్నీ భద్రంగా ఉంచామని తెలిపారు. తెలంగాణ పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదని.. తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని బాధితురాలు శేజల్ తెలిపారు.గత కొంతకాలంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై శేజల్ పలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే తనను లైంగికంగా వేధించారని.. మానసికంగా హింసించారంటూ పేర్కొనడం, అంతేకాకుండా వాట్సప్ చాట్ బయటపెట్టడం కలకలం రేపింది. అయితే, శేజల్ చేసిన ఆరోపణలు దుర్గం చిన్నయ్య సైతం అప్పట్లో ఖండించారు. కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు

# టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారు

**పిఠాపురం**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు ఇస్తున్న సెంటు ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుంటూ తెలుగుదేశంపార్టీ నాయకులు చంద్రబాబునాయుడు,కింజారపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని తెలుగుదేశంపార్టీకి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకోసం ఇస్తున్న సెంటు ఇళ్ల స్థలాలపై చంద్రబాబు నాయుడు,అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.పిఠాపురం మహారాజా కోట ఆవరణలోగల వైసీపీ కార్యాలయం నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి.ఎమ్మెల్యే దొరబాబు భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో బయలుదేరారు.ఈ ర్యాలీ కోటగుమ్మం సెంటర్ మీదుగా పిఠాపురం పట్టణమంతా తిరుగుతూ,గొల్లప్రోలు నగర పంచాయతీ మీదుగా చేబ్రోలు గ్రామం వరకు కొనసాగింది.ర్యాలీలో దారి పొడవునా నారా చంద్రబాబునాయుడికి,అచ్చెన్నాయుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మీడియాతో మాట్లాడుతూ.,14 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా చేసిన చంద్రబాబునాయుడు పేద ప్రజలకు ఒక్క గజం ఇళ్ల స్థలం కూడా మంజూరు చేయలేదని,నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేస్తుంటే చూసి ఓర్వలేక సెంటు స్థలాలను స్మశాన వాటికలగా పోల్చడం దారుణమని అన్నారు.

# దోస్త్...మేరా దోస్త్...ఎవరికి ఎవరు

**విజయవాడ :**

ఏపీలో పొత్తు రాజకీయం పై క్లారిటీ వస్తోంది జగన్ వర్సస్ చంద్రబాబు రాజకీయ యుద్ధంలో ఎవరెటు వైపో స్పష్టత కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ టీడీపీతో పాటుగా బీజేపీతో పొత్తు ఖాయమని ధీమాగా చెప్పారు. బీజేపీ ఒప్పుకోకుంటే ఒప్పిస్తామని చెప్పుకొచ్చారు. కానీ, ఢిల్లీ కేంద్రంగా సమీకరణాలు మారిపోతున్నాయి పొత్తు ప్రతిపాదన తరువాత బీజేపీ నాయకత్వం ఏపీ సీఎం జగన్ తో మరింత సఖ్యతగా కనిపిస్తోంది. మహానాడు సమయంలో అటు ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలతో పొత్తుల లెక్కలు మారిపోతున్నాయి. ఏపీలో పొత్తు రాజకీయం :ఏపీలో పొత్తు రాజకీయం ఢిల్లీ కేంద్రంగా సాగుతోంది. బీజేపీ నిర్ణయం పైన పొత్తుల వ్యవహారం ఆధారపడి ఉంది. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ నేతలు కూడా ఈ రెండు పార్టీలతో పొత్తుకు సిద్దంగా ఉందనే అభిప్రాయం కలిగింది. కర్ణాటకలో బీజేపీ ఓడిపోవటంతో తెలుగు రాష్ట్రాల్లో పొత్తుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటుందనే విశ్లేషణలు వినిపించాయి. కానీ, ఢిల్లీ నుంచి దీనికి భిన్నంగా సంకేతాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ సుదర్ఘ కాలంగా కేంద్రం వద్ద అభ్యర్థిస్తున్న అంశాలను ఈ మధ్య కాలంలో వేగంగా ఢిల్లీలో క్లియరెన్స్ లభిస్తోంది. అదే సమయంలో ముఖ్యమంత్రి జగన్ కు బీజేపీ పెద్దల వద్ద ప్రాధాన్యత పెరిగినట్లు స్పష్టంగా కనపిస్తోంది. సీఎం జగన్ కు ప్రాధాన్యత:నూతనంగా నిర్మించిన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి బీజేపీ ముఖ్యులు నుంచి ఏపీ సీఎం జగన్ కు ఆహ్వానం అందింది. అదే సమయంలో ప్రధాని పార్లమెంట్ ప్రారంభించటం పైన వివాదం మొదలైంది. ప్రతిపక్షాలు మూకుమ్మడిగా ఈ కార్యకరమాన్ని బహిష్కరించాలని నిర్ణయించాయి. ఈ సమయంలో సీఎం జగన్ చేసిన ట్వీట్ జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. ప్రధాని మోదీని అభినందించారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరారు. సీఎం స్వయంగా పార్లమెంట్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. అమిత్ షాతో సహా కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ లో తొలి వరసులో జగన్ కు సీటు కేటాయించారు. ఇవన్నీ చూసిన తరువాత టీడీపీ, జనసేనకు బీజేపీ నేతలు ఏం సంకేతాలు ఇవ్వాలనుకుంటున్నారో స్పష్టత వచ్చింది. పవన్ చేతిలో నిర్ణయం:బీజేపీ తమతో కలిసి రాదని దాదాపు టీడీపీకి అర్దమైంది. మహానాడు సమయంలనే పార్టీలో ముఖ్య నేతల మధ్య ఢిల్లీ పరిణామాలపై చర్చ జరిగింది. సీఎంకు బీజేపీ మద్దతుగా నిలుస్తున్న సమయంలో టీడీపీ, జనసేన మాత్రమే పొత్తుతో వెళ్లే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ తో పొత్తు లేదనే అంతిమ నిర్ణయానికి వస్తే వామపక్షాలను కలుపుకొని వెళ్లే ఛాన్స్ ఉంది. బీజేపీతో ప్రతిపాదన చేసింది పవన్ కావటంతో.. ఇప్పుడు పవన్ మరోసారి బీజేపీతో చర్చలు చేస్తారా..లేక..బీజేపీ వైఖరి కారణంగా ఇక టీడీపీతో కొనసాగాలని నిర్ణయిస్తారా అనేది ఇప్పుడు పవన్ నిర్ణయించాల్సి ఉంది. దీంతో..రానున్న కొద్ది రోజుల్లోనే బీజేపీతో పొత్తు కొనసాగింపు..టీడీపీతో అధికార పొత్తు పైన పవన్ నిర్ణయం తీసుకొనే అవకాశం కనిపిస్తోంది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ లో బీజేపీకి ప్రజాదరణ పెరిగిందని, జనసేన, బిజెపి పొత్తుతో ఏపీలో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఏదైనా చెబితే అది వారి సొంత అభిప్రాయం కింద పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పురోగతి లేక అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మారిందని.. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికే కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీ విధానంలో మేమంతా పని చేస్తామన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకే కేంద్రం సహకారం అనే వాదనలో వాస్తవం లేదని కొట్టి పారేశారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనే కేంద్రం కోరుకుంటుందని, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కారణాలతో ఆరోపణలు చేస్తున్నారని తప్పుబట్టారు. పేదల కోసం కేంద్రం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని,పోలవరం పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఖరి సరిగా లేదని వ్యాఖ్యానించారు. చేసిన పనులకు బిల్లులు పూర్తి గా ఇవ్వలేదన్నారు. మోడీ తొమ్మిదేళ్లలో పూర్తి పారదర్శకమైన పాలన అందిస్తున్నారని, మోడీ మంచి పాలన అందిస్తున్నారనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. 2024 ఎన్నికలలో దేశ వ్యాప్తంగా మోడీ హవాతో విజయం సాధిస్తామని,దేశ ఆర్థికాభివృద్ధి ఎంతో పెరిగిందని చెప్పారు.భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇతర దేశాల నుంచి కూడా తరలి వస్తున్నారని, సుస్థిరమైన ప్రభుత్వం, సమర్ధవంతంగా మోడీ పాలనే ఇందుకు కారణం అన్నారు. మహారాష్ట్రలో శివసేన బిజెపితోనే ఉందన్నారు. మమతా బెనర్జీ, కేసీఆర్ విధ్వంసకర విధానాలు అమలు చేస్తున్నారని కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా మండిపడ్డారు.

# స్కీమ్ లపైనే ఆశలన్నీ

**నల్గొండ :**

భారత రాష్ట్ర సమితి (ఃఖీా) అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు స్కీమ్ లతో ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని యోచిస్తోంది. రాష్ట్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటూ.. పలు పథకాలతో ప్రజలను ఆకర్షించడానికి ముందుకు వస్తోంది. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలలో సంక్షేమ పథకాలను పంపిణీ చేయడం, అమలు చేయడం ద్వారా తన ఓటు బ్యాంకును పెంచుకోడానికి ప్రయత్నం చేస్తోంది. రానున్న రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన వర్గాలకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేస్తుంది, గృహ లక్ష్మి పథకం కింద పేద కుటుంబాలకు 3 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షలు అందజేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి కేసీఆర్ ముందుకు వచ్చారు. ప్రస్తుతానికి కొందరికే ఈ పథకాలు దక్కినా.. రాబోయే రోజుల్లో ఎంతో మంది లబ్ధిదారులు ఇందులో భాగమయ్యేలా చూడనున్నారు. జూన్ 24 నుంచి 30 వరకు పలు జిల్లాల్లో లబ్ధిదారులకు పోడు భూముల పట్టా పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పాల్గొంటారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకులో ఎక్కువగా బీసీలే ఉన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీ సామాజికవర్గం ఓట్లు ఉన్న నేపథ్యంలో వారిని తమతోనే ఉంచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తూ ఉంది. 2014, 2018 ఎన్నికల్లో ఈ సామాజికవర్గంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపాయి. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయా సామాజికవర్గాల మద్దతు తమకేనని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకోసమే వారి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను తీసుకుని వస్తున్నారు. ఆ పథకాలే బీఆర్ఎస్ కు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని ఆశిస్తూ ఉన్నారు.

## ఆధార్ ఇవ్వకపోతే.. రేషన్‌కార్డులో మీ పేర్లు ఉండవ్..

**చెన్నై :**

ఆధార్ నెంబరు సమర్పించని పిల్లల పేర్లను రేషన్‌కార్డు ల నుంచి అధికారులు తొలగించారు. రేషన్‌కార్డు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే సమయంలో కుటుంబ పెద్ద, సభ్యులు అని ప్రతి ఒక్కరి ఆధార్ నెంబర్లు అప్‌లోడ్ చేయాలి. ఐదేళ్లలోపున్న పిల్లలకు ఆధార్ ఉంటే ఆ నెంబరు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే జనన ధృవీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి. ఐదేళ్లకు పైగా ఉన్న వారు ఆధార్ నెంబరు తప్పని సరిగా నమోదు చేయాలి. అయితే పలువురు వారి పిల్లల నెంబర్లు నమోదు చేయడం లేదు. వారి జాబితా రేషన్ దుకాణాలకు పంపి ఆధార్ నెంబరు నమోదు చేయాలని ఉద్యోగులకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వివరాలను ఉద్యోగులు కార్డుదారులకు తెలియజేయడం లేదు. అదే సమయంలో పలువురు పిల్లల పేర్లు కార్డు నుంచి అధికారులు తొలగించారు.

# మ్యానిఫెస్టో... మాయ చేస్తుందా...

**రాజమండ్రి:**

తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు తొలి మ్యానిఫేస్టోను విడుదల చేశారు. మూడు వర్గాలను ఎంపిక చేసుకుని వారికి తాము అధికారంలోకి వస్తే ఏం చేయనున్నామో చెప్పారు. అయితే దీనికి భవిష్యత్ గ్యారంటీ అని నామకరణం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహాన్నే చంద్రబాబు అనుసరిస్తున్నారు. కర్ణాటకలోనూ ఐదు స్పష్టమైన హామీలతో కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు విడుదల చేసింది. దానికి నకలుగానే టీడీపీ తొలి మ్యానిఫేస్టోను చూడాల్సి ఉంటుంది. కర్ణాటక తరహాలోనే మహిళలకోసం ప్రత్యేక పథకాలను చంద్రబాబు ప్రకటించారు. దీనికి మహిళ శక్తి అని పేరు పెట్టారు. ఈ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500లు ఇస్తారు. ఇంట్లో ఎందరు మహిళలున్నా వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. 18 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళలు మాత్రమే దీనికి అర్హులు. ఇక జిల్లాల్లో ప్రతి మహిళకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించారు. అలాగే అమ్మఒడి తరహాలోనే తల్లికి వందనం కార్యక్రమం కింద ప్రతి ఏడాదికి పదిహేను వేలు ఇస్తారు. దీనికి లిమిట్ లేదు. ఎంత మంది పిల్లలున్నా అందరికీ ఈ పథకం వర్తిస్తుంది. దీంతో పాటు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అంటే ఏడాదికి ఒక కుటుంబానికి 3,600 రూపాయలు సేవ్ అయినట్లే. అలాగే ఇంటింటికి మంచినీరు అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ప్రాధాన్యతగా దీనిని తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఇంటికీ ఉచితంగా ఇంటి కుళాయి ఇస్తారు. అన్నదాత పథకం కింద... ఇక అన్నదాత పథకం కింద రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏడాదికి ఇరవై వేల రూపాయలు పెట్టుబడి సాయాన్ని అందిస్తామన్నారు. అంతేకాకుండా యువగళం పేరుతో ఏపీలోని నిరుద్యోగులందరికీ నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు ఇద్దరు పిల్లల చట్టాన్ని ఎత్తేస్తామన్నారు. దీంతో పాటు బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తెస్తామన్నారు. అయితే ఈ హామీలను చంద్రబాబు అధికారంలోకి వస్తే అమలు చేస్తారా? లేదా? అన్నదానిపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబుకు తొలి ప్రయారిటీ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులు మాత్రమే. వీటికి వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేస్తామని చెబుతున్నప్పటికీ అందుకు అవసరమైన నిధులు చంద్రబాబును ఇబ్బంది పెడతాయంటున్నారు. ఆయన ఈసారి అధికారంలోకి వస్తే అమరావతిపైన దృష్టి పెట్టిన తర్వాతనే మరో అంశాన్ని పరిశీలిస్తారన్నది ఆ పార్టీ నేతలు సయితం అంగీకరిస్తున్న విషయం. 2014లో మ్యానిఫేస్టోను పక్కన పెట్టారని ఇప్పటికీ అధికార పార్టీ విమర్శలు చేస్తూనే ఉంది. కర్ణాటకలో ఇప్పటికే హామీలు అమలు చే?యాలంటూ ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై ప్రజలు తిరగబడుతున్నారు. నెలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్తును ఇస్తామన్న కాంగ్రెస్ ప్రకటనతో మీటర్ రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చేందుకు వెళుతున్న లైన్‌మెన్లపై జనం దాడులకు దిగుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ మహిళలు కండక్టర్లపై తిరగబడుతున్నారు. యాభై వేల కోట్లు సిద్ధరామయ్య ఇచ్చిన గ్యారంటీ కార్డు కు అవుతుండటంతో ఆయన కొంత ఇబ్బంది పడుతున్నారు. మహిళలకు ఇచ్చే భృతి విషయంలోనూ కొర్రీలు పెట్టారు. అలాగే ఉచిత ప్రయాణంపై కూడా నిబంధనలు విధించారు. కేవలం పేద మహిళలకే ఈ పథకాలు వర్తిస్తాయని చెబుతున్నారు. దీంతో పాటు ఇక చంద్రబాబు హామీలు ఇచ్చి అమలు చేయరన్న అపవాదు ఎటూ ఉండనే ఉంది. అందుకే ఈ గ్యారంటీ కార్డుపై జనం ఏ మాత్రం నమ్మకం పెట్టుకుంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. చంద్రబాబు మాత్రం తనను గెలిపిస్తే ఖచ్చితంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెబుతున్నారు. రాజకీయ నేతకు ప్రథమంగా ఉండాల్సింది జనంలో నమ్మకం. జనం నమ్మితే మాత్రం బాబు ఇచ్చిన హామీలతో సక్సెస్ అవుతారు. ఇదికేవలం తొలి విడత మ్యానిఫేస్టో మాత్రమే. మలి విడత కూడా ఉండనుంది. మరి ఏడాదికి ఎన్ని వేల కోట్ల హామీలు చంద్రబాబు ఇవ్వనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. హామీలు ఇవ్వడం ఓకే. గ్యారంటీ కూడా సరే. కానీ దాని అమలు మాత్రమే అసలైన ప్రశ్న. తొలుత ఈ విషయంలో చంద్రబాబు ప్రజలను నమ్మించగలిగితే యాభై శాతం సక్సెస్ అయినట్లే. లేకుంటే మాత్రం ఎన్ని హామీలు ఇచ్చినా జనం విశ్వసించరన్నది కూడా అంతే వాస్తవం.

## ఎమ్మెల్యే శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో బ్రెడ్లు పండ్లు పంపిణీ

**మంథని**



మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా మంథని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సురయ్య పల్లె గ్రామ ఐదో వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల సురేష్ ఆధ్వర్యంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శ్రీధర్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రేపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జంజర్ల మల్లేష్, మాజీ సర్పంచ్ మంథని కర్ణ కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్ల వెంకన్న, నూకల బానయ్య, వార్డు సభ్యులు చెరుకు తోట శారద రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెద్దపెల్లి జిల్లా చైర్మన్ అరేల్లి కిరణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జంజర్ల గట్టయ్య, ఆర్ల లింగయ్య, ఆర్ల జ్ఞాని, బొద్దుల సతీష్, కొరవేణ కృష్ణ, ఆర్ల నారాయణ, కడారి సతీష్, నూకల కమల్, తదితరు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## వీసీ ఛాంబర్ ను ముట్టడించిన విద్యార్థి సంఘాలు

**నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి నియోజకవర్గం లోని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు వీసీ ఛాంబర్ ముట్టడించారు. యూనివర్సిటీలో జరుగుతున్న ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరులో యూనివర్సిటీని నాశనం చేయవద్దని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేసారు.. విసి చాంబర్ ముందు విద్యార్థుల బైఠాయించారు. వీ సీ వర్సెస్ రిజిస్టర్ గా పోరు మారింది. తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్టార్ వర్సెస్ విసి అన్న చందనంగా రిజిస్టర్ పోస్ట్ మారింది. దీనికోసం ఇటు రిజిస్టర్ ఇటు పాలకమండలి ఇద్దరు కూడా పట్టువేయడం లేదు. విసి తాను చెప్పిన వాళ్లే రిజిస్టర్ గా ఉండాలని భీష్మించుకోవడం ఒక రకంగా యూనివర్సిటీని పూర్తిగా నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నట్టుగా విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బిసి పాలకమండలి ఇద్దరు కూడా తమ పంతాలకు పోకుండా యూనివర్సిటీని రక్షించాలని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ఈప్రాంత ప్రజలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా

**-చెక్ డ్యాములను నిర్మించి మానేరు నీటిని ఒడిసిపట్టుతున్నం**

**-వృధా నీటిని వినియోగంలోకి తేవాలనే ఆలోచన చేయలే**

**-జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

**మంథని**



మానేరు నీరు వృధాపోకుండా చెక్‌డ్యాంల ద్వారా ఒడిసిపట్టి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెద్దపెల్లి జెడ్పి చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్ పుట్ట మధుకర్ అన్నారు.మంథని మండలం అడవిసోమన్‌పల్లి సమీపంలోని మానేరు నదిలో నిర్మించిన చెక్‌డ్యాంను ఆయన మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి ఆశయాల పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన మంథని ఎమ్మెల్యే తండ్రి ఆశయాలేంటోచెప్పడం లేదన్నారు. ఆనాడు తండ్రి, ఈనాడు తనయుడు నియోజకవర్గానికి చేసిందేమీా లేదని ఆయన విమర్శించారు. మంథని నియోజకవర్గాన్ని ఆనుకుని గోదావరి, మానేరు నదులు ప్రవహిస్తున్నా వృధాగా పోయే నీటిని వినియోగంలోకి తీసుకురావాలని ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ మట్టిలో పుట్టిన బిడ్డగా ప్రజాప్రతినిధిగా ఎన్నికై అడవిసోమన్‌పల్లి సమీపంలో చెక్ డ్యాం నిర్మించుకున్నామని, ఖమ్మంపల్లి మానేరుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసుకున్నామని, ఓడేడ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతోందని, అలాగే ఓదాల, గోపాల్‌పూర్, అడవిశ్రీరాంపూర్, ఓడేడ్ వద్ద మానేరుపై చెక్‌డ్యాం నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. చెక్‌డ్యాంలతో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయం చేసే రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన చెప్పారు. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన వాళ్లుప్రజాప్రతినిదిగా అయితే ఈ ప్రాంతంపై చిత్తశుద్దితో పనిచేస్తారని, ఇందుకు అడవిసోమన్‌పల్లి చెక్‌డ్యాం నిదర్శనమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని వాడుకుని అభివృద్ధి చెందాల్సిన ఈప్రాంత ప్రజలను ఎన్నికల సమయంలో మాయమాటలకు ఓట్లు వేసి మోసపోతున్నారని, మళ్లీ మోసపోకుండా వారిలో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నదే తన ప్రయత్నం అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌పార్టీ గెలిచిందని మంథని నియోజకవర్గంలో సంబరాలు చేసుకున్న ఎమ్మెల్యే కాటారం సెంటర్‌లో నిలబడి నేషనల్ హైవేను తానే తీసుకువచ్చానని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎనిమిది లైన్లరోడ్ తీసుకురావాలని మాట్లాడితీరు విడ్డూరంగా ఉందన్నారు. మహదేవ్‌పూర్ నుంచి భూపాలపల్లి వరకు 2017లో నేషనల్ హైవే మంజూరైతే 2018లో టెండర్లు పూర్తయి 2020లో రోడ్డు నిర్మాణం పూర్తయిందని, ఆ సమయంలో అధికారంలో లేని ఎమ్మెల్యే నేషనల్ హైవే తెచ్చానని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఏనాడు ఈ ప్రాంత ప్రజల ఆకలి తీర్చాలని, అంటరాని తనాన్ని నిర్మూలించాలని ఆలోచన చేయలేదని విమర్శించారు. 75ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత అగ్రబాగాన పరిపాలన చేసిన దుద్దిళ్ల కుటుంబం ఇప్పటి వరకు మంథని అంబేద్కర్‌నగర్‌లో ఏ ఇంటిలో బ్రాహ్మణులతో పురోహితం చేయించి గౌరవించిన సందర్భాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచన చేసి మన ఓట్లతో అధికారంలోకి వచ్చి మన ఆకలి తీర్చని వాళు ఎవరో గమనించాలని ఆయన స్పష్టం చేశారు.

## బ్రాహ్మణ భవన్ లో అడుగు పెట్టె ముందు సిఎం వీటికి సమాదానం చెప్పాలి

ముఖ్యమంత్రి బ్రాహ్మణ భవన్ లో అడుగు పెట్టె ముందు ఈ క్రింది 10అంశాలపై సమాదానం చెప్పాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేసారు. 1.సంస్కృత విశ్వవిద్యాలయం కావాలని మిమ్మల్ని కలిసిన ప్రతిసారి కోరారు ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. 2.నాలుగు గోడల భవన నిర్మాణంతో సమాజం అభివృద్ధి చెందదు,3 నాలుగు తరాల ప్రజలకు ఉపయోగపడే స్మార్త పాఠశాలలు వేద పాఠశాలలు ఎండోమెంట్ శాఖ ద్వారా ఎందుకు ప్రారంభించలేదని పేర్కొన్నారు. 4.బ్రాహ్మణ కార్పొరేషన్ మొక్కుబడి కేటాయింపులు అందరికీ అందని సహాయం ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఎంతమందికి ఇచ్చారు శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేసారు. 5. శాసనమండలి సభ్యులుగా నాస్తికులను నియమించి వీరు మీా ప్రతినిధులే అని ప్రకటించడం సభభా అని ప్రశ్నించారు. 6. మీా రాజకీయ పాలనలో మంత్రివర్గంలో ఎందుకు స్థానము కలిగించలేదు,7. భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు అగ్రకులాలలోని నిరుపేదల కోసం ప్రకటించిన పది శాతం రిజర్వేషన్లను. ఈ రాష్ట్రంలో ఆలస్యంగా, సరిగ్గా అమలు చేయకపోవడం వల్ల ఎంతో నష్టం జరిగిందన్నారు. 8) బ్రాహ్మణ న్యాయవాదులను ,పూజారులను హత్య చేసినప్పుడు ఎందుకు స్పందించలేదు కఠిన చర్యలు తీసుకోలేదు. 9.ధరణి పోర్టల్ వల్ల దేవాలయ భూములు, మాన్యం భూములు ,ఇనాం భూములు అన్యక్రాంతమవుతుంటే ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. 10. స్మశాన వాటిక లలో పితృకర్మల కొరకు వసతులను ఎందుకు పట్టించుకోలేదని పేర్కొన్నారు. పై 10 ప్రశ్నలకు సమాదానం చెప్పి బ్రాహ్మణ భవన్ లో అడుగు పెడితే మంచిదని ప్రబాకర్ పేర్కొన్నారు.

## చెప్పులతో వైకాపా బాహాబాహీ

**శ్రీ సత్యసాయి**

రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీలోని ఇరు వర్గాలు చెప్పులతో కొట్టుకున్నారు. కనగానపల్లి మండలం కోనాపురంలో ప్రభుత్వ నిధులను కాజేసిన వ్యవహా రంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. విభేదాల నేపథ్యంలో కనగానపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో వైసీపీలోని ఇరు వర్గాలు చెప్పులతో కొట్టుకున్నారు. వైసీపీలోని ఇరు వర్గాల దాడులు ప్రతి దాడులతో ప్రభుత్వ ఉద్యోగులు పరుగులు పెట్టా రు. పోలీసుల సమక్షంలోనే వైసీపీలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుసుకుంది.

## కోడి పందెలపై దాడి..ఆరుగురు అరెస్టు

**నెల్లూరు**

ఉమ్మడి నెల్లూరు జిల్లా ఓజిలి మండలం పాపిరెడ్డి కండ్రిగ గ్రామ పొలాల్లో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరాలపై సెబ్ అధికారులు దాడులు చేశారు .ఈ దాడుల్లో కోడి పందెం ఆడుతున్న 6 గురితోపాటు,2 కోళ్ళు,5 బైక్లు,2 వేల రూపాయల నగదు స్వదీనంచేసుకున్నారు.వీరిపై కేసునమోదు చేసి కోర్టు కు హాజరు పరచనున్నట్లు సెబ్ సిఐ ఆర్యావి ప్రసాద్ తెలిపారు.

## శ్రీశైలంలో చిరుత పులి సంచారం

**శ్రీశైలం**

శ్రీశైలంలో నిన్న అర్ధరాత్రి వీరశైవ గురుకులం వద్ద చిరుతపులి సంచారం కలకలం రేపింది. శ్రీశైలంలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గల వీరశైవగురుకుల పాఠశాల వద్ద సోమవారం అర్ధరాత్రి చిరుత పులి సంచరిస్తుండగా గురుకుల పాఠశాలలో పిల్లలు గుర్తించి భయాందోళనకు గురైయారు. వారంతా గట్టిగా అరవడంతో పులి తిరిగి అడవిలోకి పారిపోయింది. పాఠశాలలో వున్న కొంతమంది పులిని గుర్తించి సెల్ఫోన్లో చిత్రీకరించారు. అక్కడ చాలాసార్లు చిరుత పులులు తిరుగుతుంది. ప్రతి నెలకొకసారి అక్కడ చిరుతపులిలు కనపడుతూనే ఉంటున్నాయి.

## దౌర్జన్యరాజకీయాలు వద్దు

**కొత్తగూడెం**

ప్రజాభిమానం పొందాలి తప్ప దౌర్జన్యాలతో రాజకీయం చేస్తే ప్రజలు హర్షించరని భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య అన్నారు.పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బొర్రా రాజశేఖర్, మద్దినేని బేబి స్వర్ణ కుమారి,కోటా రాంబాబు,బానోతు విజయా భాయితో కలిసి మీడియాతో మాట్లాడారు.
మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానిపై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడిని పొంగులేటి వర్గియులు ఖండించారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపు మేరకు ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాలులు ఆర్పించేందుకు చీకటి కార్తీక్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లగా మంత్రి పువ్వాడ అనుచరులు అతని మీద దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓటమి భయంతోనే ఇలా చేయిస్తున్నారని ఇలాంటి ఘటనలు ఖమ్మంలో జరగడం ఇది మెదటి సారి కాదన్నారు. వైఎస్ ఆర్ కాలనీలో కూడా ఇలాగే ప్రవర్తించారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## భూములు లాక్కున్నారు

**జంగారెడ్డిగూడెం**

పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామం లో గత 70 సంవత్సర కాలంగా సాగు చేసుకుంటున్న పంట చేను స్థలాన్ని ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించారు అని కుటుంబ సభ్యులు అంతా పురుగు మందు తాగేందుకు ప్రయత్నించారు. మేమంతా దళితులం. మాపై ఈ చర్యలు తగవు. బడా భూస్వాములు వద్ద భూములు ఉన్న కూడా మా భూమిని బలవంతంగా లాక్కెవడం దారుణ మని అన్నారు

## ఫీవర్ హాస్పిటల్ లో క్షయ వ్యాధి రోగుల కు టిబి కిట్స్ పంపిణీ

**హైదరాబాద్ :**



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ టిబి కన్వీనర్ డా విజయ్ భాస్కర్ గౌడ్ అధ్వర్యంలో రెడ్ క్రాస్ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి సమక్షంలో శ్రీ విద్యా సెకండరీ స్కూల్ వ్యవస్తాపకులు మధు సూదన్ రెడ్డి సహాయం తో ఫీవర్ హాస్పిటల్ లో క్షయ వ్యాధి రోగులు కు టిబి కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ భీమ్ రెడ్డి మాట్లాడుతూ మరింత మంది దాతలు ముందుకు వచ్చి క్షయ వ్యాధి రోగుల ను ఆదుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు.

## ఏసీబీ వలలో మహిళా విఆర్వో

**బాపట్ల**



ఏసీబీ వలలో పొన్నపల్లి విఆర్ఓ నీలం స్వాతి చెరుకుపల్లి మండలం పొన్నపల్లి సచివా లయంలో 18 వేల రూపాయలు లంచం తీసుకుంటూ విఆర్వో స్వాతి దొరికిపోయింది. భూమిని ఆన్లైన్ చేసేందుకు స్వాతి లంచం డిమాండ్ చేసింది

# తగ్గిన గులాబీ దూకుడు

**గుంటూరు:**

ఆంధ్రప్రదేశ్లో బీఆర్ఎస్ హడావుడి తగ్గిందా? రాష్ట్రంలో రాజకీయాలను పూర్తిగా వదిలేసిందా? రాష్ట్రంలో పార్టీ విస్తరణ ఆపరేషన్ ఆగిందా? అంటే అవుననే సమాధానమే రాష్ట్ర రాజకీయ వర్గాల నుండి వినిపిస్తోంది. అప్పట్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన హడావుడి అంత ఇంత కాదు. ఏకంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ను కొనకున్నా.. కొన్నంతా పని చేశారు. అయితే ఇప్పుడు భారత రాష్ట్ర సమితి పేరుతో కేసీఆర్ చేసిన హడావుడి కాస్తా నెమ్మదించినట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో పార్టీ విస్తరణపై ఏదో మొక్కుబడి పనులు చేస్తున్నా, ఏపీలో మాత్రం రాజకీయాలను పూర్తిగా వదిలేశారని వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఏపీలో పార్టీ అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం రాష్ట్ర నాయకుల్లో సన్నగిల్లుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ ఇప్పటికే మూడు సభలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రతి రోజూ కొంతమందిని హైదరాబాద్కు తీసుకువచ్చి పార్టీ కండువా కప్పుతూ ఫొటోలకు పోజులిస్తున్నారు. అంతకుముందు పలువురు ఆంధ్రప్రదేశ్ నేతలను చేర్చుకుని, అక్కడ పార్టీని భారీగా విస్తరిస్తామని ప్రకటించారు. ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షునిగా తోట చంద్రశేఖర్ను నియమించారు. విశాఖపట్నంలో సభ నిర్వహిస్తామన్న బీఆర్ఎస్.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు కూడా.. పార్టీ విస్తరణ కోసం పని చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఏపీలో బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ కార్యాలయాన్ని తోట చంద్రశేఖర్ ప్రారంభించిన సమయంలో ఆ పార్టీ చీఫ్ కేసీఆర్, తెలంగాణకు చెందిన నేతలు ఎవరూ కూడా హాజరు కాలేదు. ఏపీలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పార్టీ అగ్రనాయకులు ఎవరూ హాజరుకాకపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అటు తెలంగాణలోని పలు జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కొత్త ఆఫీసులను సీఎం కేసీఆరే స్వయంగా ప్రారంభించారు. ఆ సందర్భంగా బహిరంగ సభలను ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాలపై సెన్సెషనల్ వ్యాఖ్యలు చేశారు. భాష రాని మహారాష్ట్రకు వెళ్లి వరుస సభలు పెడుతున్న కేసీఆర్.. పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏపీలో బీఆర్ఎస్ నాయకులు స్తబ్దుగా ఉండటం వెనక అసలు మతలబు ఏంటనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏపీ ప్రజల పట్ల కేసీఆర్ చేసిన కామెంట్స్ గుర్తుకు వచ్చి వెనక్కి తగ్గుతున్నారని కొందరంటున్నారు.

# మళ్లీ వేడెక్కిన తాడిపత్రి

**అనంతపురం:**

అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాలు రసవత్తరంగా మారుతు న్నాయి. తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్సెస్ జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య వార్ కొనసాగుతోంది. ఇక ఇదే సమయంలో తాజాగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ని టార్గెట్ చేస్తూ కరపత్రాలు స్థానికంగా కలకలం సృష్టించాయి. మూడో విడత ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజక వర్గంలో పర్యటిస్తున్నారు. నేటితో మూడో విడత ప్రజా సంక్షేమ యాత్ర పూర్తి కానున్న నేపథ్యంలో గన్నెవారి పల్లి కాలనీలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అయితే ఈ క్రమంలోనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి కి వ్యతిరేకంగా కరపత్రాలు స్థానికంగా కలకలం గా మారాయి. ఆ కరపత్రాల లో ఎమ్మెల్యే పెద్దారెడ్డిని టార్గెట్ చేస్తూ అనేక అంశాలు ఉన్నాయి. ప్రతి రోజు జేసీ సోదరులను తలచుకోకపోతే నీకు నిద్ర పట్టదు పెద్దారెడ్డి అంటూ టార్గెట్ చేశారు. పెద్దారెడ్డి ప్రజల కోసం తాను ఏం చేశారు అనేది చెప్పుకోవడం లేదని, ఎందుకంటే ఆయన చేసింది ఏమీ లేదు కాబట్టి చెప్పలేకపోతున్నారు అంటూ విమర్శించారు. దోచుకోవడం గురించి పెద్దారెడ్డి మాట్లాడడం బాగోదని కరపత్రాలలో ఎద్దేవా చేశారు. దీంతో కరపత్రాలను గురించి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఈ పని చేసింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసమే ప్రత్యర్థులు ఈ విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు గెలవరని భావించి, ఇలాంటి కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిపై చర్చ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కరపత్రాల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే తాడిపత్రిలో కరపత్రాల పంపిణీ గురించి అలర్ట్ అయిన పోలీసులు ఎమ్మెల్యే కు వ్యతిరేకంగా కరపత్రాలను ఎవరు వేశారు అన్నదానిపై విచారణ జరుపుతున్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులను పలువురిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. మరి ఈ వ్యవహారం ముందు ముందు ఏ రూపు తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.

# జగన్ ట్రాప్ లో చంద్రబాబు

**రాజమండ్రి :**

ఏపీలో నిన్న టీడీపీ మహానాడు సందర్భంగా రాజమండ్రిలో ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోపై చర్చ జరుగుతోంది. గతంలో సంక్షేమం కంటే అభివృద్ధే మిన్నగా భావించిన చంద్రబాబు తన పాలనలో దానికే ప్రాధాన్యమిచ్చారు. అభివృద్ధి అంటే చంద్రబాబు పేరు గుర్తుకురావాలన్నట్లుగా తపించిన చంద్రబాబుకు 2019 ఎన్నికలు బొప్పి కట్టించాయి. దీంతో ఇప్పుడు ఆయన వైఎస్ జగన్ సంక్షేమ మంత్రానికి మరింత మసాలా జోడించి మినీ మ్యానిఫెస్టో ప్రకటించినట్లు అర్థమవుతోంది. 2018లో కేంద్రంలో బీజేపీతో అధికారం పంచుకుంటున్న చంద్రబాబును ఎన్డీయేతో విడదీసేందుకు రాజకీయంగా వైసీపీ అధినేతగా ఉన్న జగన్ ఓ రాయి వేశారు. కేంద్రం విభజన హామీలు నెరవేర్చకున్నా టీడీపీ ఎందుకు ఇంకా ఎన్డీయేలో కొనసాగుతోందని ప్రశ్నించడం మొదలుపెట్టారు. దీంతో రాష్ట్రంలో అధికారంలో ఉంటూ, కేంద్రంలో రెండు మంత్రి పదవుల్లో కొనసాగుతున్న టీడీపీపై ఒత్తిడి అమాంతం పెరిగిపోయింది. ఇది కాస్తా అంతకంతకూ పెరిగి చివరకు బీజేపీతో పొత్తుకు, ఎన్డీయేలో భాగస్వామ్యానికి, కేంద్రమంత్రి పదవులకు గుడ్ బై చెప్పేసిన టీడీపీ.. ధర్మపోరాటం పేరుతో అభాసుపాలైంది. ఇప్పుడు చంద్రబాబు నిన్న రాజమండ్రిలో ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను గమనిస్తే వైసీపీ కన్నా ఎక్కువ సంక్షేమం అమలు చేస్తామనే నమ్మకం కల్పించాలనే ప్రయత్నం కనిపించింది. అయితే సంక్షేమం విషయంలో చంద్రబాబుకు ఉన్న పేలవ రికార్డు ఈ మినీ మ్యానిఫెస్టోను జనాల్లోకి ఏ మేరకు తీసుకెళ్తుందన్నది కాలమే చెప్పాలి. అయితే చంద్రబాబు తన సొంత విధానం కంటే సంక్షేమం విషయంలో జగన్ ను ఫాలో అవ్వాలని భావిస్తుండటం చూస్తుంటే ఆయన తాజా పరిస్థితి అర్ధమవుతోంది. గతంలో ప్రత్యేక హోదా పేరుతో జగన్ మొదలుపెట్టిన వాదన ట్రాప్ లో పడి అధికారం కోల్పోవడమే కాకుండా బీజేపీకి బద్ధశత్రువుగా మారిపోయిన చంద్రబాబు.. ఇప్పుడు సంక్షేమం విషయంలో తామే మెరుగు అని చెప్పుకునేందుకు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో కూడా ఆ విషయంలో జగన్ ను అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నట్లే ఉంది. తద్వారా మరోసారి జగన్ ట్రాప్ లో పడి జనంలో పలుచన అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వైసీపీ ప్రభుత్వంలోనే బద్వేలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది

### ఎమ్మెల్యే డాక్టర్ సుధ

**బద్వేలు**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బద్వేల్ పట్టణం, నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ లోని సభా భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు నాడు బద్వేల్ కి, నేడు బద్వేల్ కి అభివృద్ధిలో ఎంత తేడా ఉందో టిడిపి నాయకులు గమనించాలని పేర్కొన్నారు.2019 కి ముందు టిడిపి ప్రభుత్వంలో బద్వేల్ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని 2019 తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లో మున్సిపాలిటీ అలాగే బద్వేల్ నియోజకవర్గం అన్ని విధాల ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.2019 తర్వాత బద్వేల్ ముఖచిత్రమే మారిపోయిందని బద్వేల్ పట్టణంలో కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు వేసామని, అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే మున్సిపాలిటీ కార్యాలయం, సీమం కు ఆసుపత్రి అభివృద్ధి, రెండు కోట్లతో డయాలసిస్ సెంటర్, లైబ్రరీ ఏర్పాటు, ఆర్డిఓ కార్యాలయం, అలాగే చెన్నంపల్లె చెన్నకేశవ స్వామి దేవాలయము ఆధునికరణ, లక్ష్మీ పాలెం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధునికరణ, ముఖ్యంగా సెంచరీ ప్లైవుడ్ కంపెనీ ఏర్పాటు, విద్యుత్ సబ్ స్టేషన్ లో ఏర్పాటు, ఎల్ ఎస్ పి ఎడమ కాలువ విస్తరణ చేయడం, నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి ఆధునికరణ, అలాగే బద్వేలు పట్టణానికి బ్రహ్మ సాగర్ నుండి త్రాగునీటి సరఫరా చేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే జరిగాయని అన్నారు, టిడిపి నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని 2019 సంవత్సరానికి ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నది కదా బద్వేల్ నియోజకవర్గాన్ని ఎంతవరకు అభివృద్ధి చేశారని ప్రశ్నించారు? ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలను మా నీ బద్వేల్ అభివృద్ధి కళ్ళముందు ప్రత్యక్షంగా కనబడుతుందని, అభివృద్ధిని కల్లారా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ మున్సిపల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎర్ర గొల్ల గోపాలస్వామి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**నెల్లూరు**



రాపూరు మండలంసిద్ధవరం దగ్గర రహదారిపై రోడ్డు ప్రమాదం...ఆగివున్న లారీని ఢీ కొట్టిన కారుకారులో ప్రయాణిస్తున్న నలుగురి లో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు,మరో ముగ్గురికి స్వల్ప గాయాలు..ఆత్మకూరు నియోజకర్గం జంగాలపల్లికి చెందిన ఒక కుటుంబం తిరుమలకు వెళ్లి తిరిగి వస్తుండగా రాపూరు మండలం సిద్ధవరం సమీపం లో ఆగివున్న లారీని ఢీ కొన్నది,ఈ ప్రమాదం లో ఒక వ్యక్తి తీవ్ర గాయాలు పాలవుగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయినట్టు డ్రైవరే నిద్ర మత్తులో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం

## రాజేంద్రనగర్ లో లారీ బీభత్సం

**రంగారెడ్డి**



రాజేంద్రనగర్ లో లారీ బీభత్సం సృష్టించింది. వ్యవసాయ కళాశాల వద్ద ఆగి ఉన్న కారును లారీ ఢీ కొంటూ దూసుకుని వెళ్లింది. ఘటనలో లారీ డ్రైవర్ స్పాట్ లో మృతి చెందాడు. కారులోని వ్యక్తి స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ధాన్యం లోడ్డు తో వెళుతున్న లారీ కారు ను ఢీ కొని పక్కకు ఒరిగిపోయింది. ఘటనలో కారు పాక్షికంగా ద్వంస్వమైయింది. . కర్నూల్ జిల్లా నుండి హైదరాబాద్ కు వస్తుండగా ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్ కు గుండె పోటు రావడం తో ప్రమాదం జరిగినట్లు అనుమానం.

## వాగ్వాదాలతో సాగిన జడ్పీ భేటీ

**నిర్మల్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్ లో జెడ్పి చైర్ పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జెడ్పి సర్వ సభ్య సమావేశం వాడీ వేడిగా జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తో పాటు కలెక్టర్ వరుణ్ రెడ్డి జెడ్పి సీఈఓ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పెంబి, సారంగపూర్ మండలాల జడ్పిటిసిలు బుక్య జానుబాయి, పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డిలు వరి ధాన్యము కొనుగోళ్ల జాప్యం విషయంలో మంత్రిని ప్రశ్నించగా మాట్లాడుతుండగానే మైక్ ను అధికారులు కట్ చేశారు. దీంతో కోపోద్రిగుడైన పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ముందే మైకును విసిరేశారు. ఖానాపూర్ సమస్యల విషయంలో ఎమ్మెల్యే రేఖా నాయక్ మరియు జెడ్పిటిసి జానుబాయి ల మధ్య సైతం వాగ్వివాదం జరిగింది. ఇలా ఉండగా సమావేశంలో తనకు సమస్యలు వివరించేందుకు మైకు ఇవ్వలేదని పెంబి జెడ్పిటిసి సభ్యురాలు జాను బాయి సమావేశంలో కింద కూర్చొని నిరసన తెలిపారు. జెడ్పిటిసి వ్యవహార శైలిపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది.

## ఓ ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్

**సంగారెడ్డి**

నిజాంపేటలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా ప్రమాదవశాత్తు భారీ శబ్దంతో సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు ఎగిరిపడ్డాయి. ఇంటికి మంటలు అంటుకున్నాయి. పెంకుటిల్లు కావడంతో భారీగా ఎగిసిపడుతున్న మంటలు, పక్కనే ఉన్న మరో ఇంటికి అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసారు

## ఆందోల్ లో రోడ్డెక్కిన రైతన్నలు

**సంగారెడ్డి**

ఆందోల్ లో రైతన్నలు రోడ్డెక్కారు. అకాల వర్షాలతో వడ్లు తడుస్తున్నాయని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. నాందేడ్ - అఖోల నేషనల్ హైవేపై రైతులు ధర్నా కుదిగారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళనక దిగారు. రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచెలు వేసి నిరసన తెలిపారు.ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రోడ్డుకి ఇరువైపులా స్తంభించింది.

## కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

**సూర్యాపేట**

కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యురాలు ఆసుపత్రికి రాకపోవడంతో గర్భిణీకి నర్సులు డిలివరి చేసారు. నర్సుల నిర్లక్ష్యానికి నవజాత శిశువు మృతి చెందిందని బంధువుల అరోపించారు.
అజాగర్తతో నర్సులు వైద్యం చేయడంతోనే శిశువు మృతి చెందినట్లు బంధువుల అందోళన కు దిగారు. బాధితురాలు నడిగూడెం మండలం కరివిరాలకు చెందిన మానస గా గుర్తించారు. నర్సులు డాక్టర్ కి సమాచారం ఇచ్చిన రాలేదని బంధువుల ఆవేదన వ్యక్తం చేసారు. న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేసారు.

# మితిమీరుతున్న లోన్ యాప్ ఆగడాలు

**రాజమండ్రి :**

ఆన్ లైన్ లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. ఇప్పటి వరకు లోన్ యాప్ లను సంప్రదించి అప్పు తీసుకున్న వారినే వేధించిన సంఘటనలు చూశాం. కానీ తూర్పు గోదావరి జిల్లా కడియంలో సరికొత్త లోన్ యాప్ వేధింపుల ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కడియం మండలంలో నివాసం ఉండే దేవి అనే మహిళ నిన్న దిశా ఎస్ఓఎస్ కు కాల్ చేసి తనను లోన్ యాప్ నిర్వాహకుడు వేధిస్తున్నట్టుగా సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాధితురాలి ఇంటికి వెళ్లిన దిశ పోలీసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజుల కిందట గుర్తు తెలియని నెంబర్ నుండి తనకు 2000 రూపాయలు ఫోన్ పే ద్వారా వచ్చాయని.. అది గమనించి వెంటనే అదే నెంబర్ కు అమౌంట్ తిరిగి పంపించినట్లు తెలిపారు. అప్పటి నుండి అదే నెంబర్ నుండి వాట్సాప్ కాల్ చేసిన వ్యక్తి హిందీ, ఇంగ్లీషులో మాట్లాడుతూ వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధితురాలు వాపోయారు. అదనంగా డబ్బులు చెల్లించాలని లేదంటే తన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బాధితురాలిని బెదిరించాడు. ఆగంతకుడు చెప్పిన విధంగానే బాధితురాలి ఫోటోలను మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫోటోలను పంపించడం మొదలు పెట్టాడు. ఆగంతకుడి ఆకృత్యాలు శృతిమించడంతో బాధితురాలు దిశా పోలీసులకు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. బాధితురాలు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆగంతకుడు కాల్ చేసిన ఫోన్ నెంబర్, ఇతర వివరాల ఆధారంగా కడియం పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. అజ్ఞాత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి వేధింపులకు పాల్పడితే వెంటనే దిశ ఎస్ఓఎస్ కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు అతి పెద్ద ఫేక్ లోన్ యాప్స్ ముఠా ఆట కట్టించారు. ముగ్గురు విదేశీయుల్ని కూడా అరెస్ట్ చేశారు. లోన్ , గేమింగ్ యాప్స్ పేరుతో కస్టమర్లను ఆకర్షించి తర్వాత వారిని బ్లాక్ మెయిల్ చేసి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. మొత్తం ఎనిమిది దేశాల్లో వీరి నేర సామ్రాజ్యం విస్తరించి ఉందని పోలీసులు చెబుతున్నారు. తూ.గో జిల్లా కడియం పోలీస్ స్టేషన్ లో వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపిన పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. మలేషియాలో ఉంటూ.. అక్కడ్నుంచే .. ఇండియాలో ఏజెంట్లను పెట్టుకుని ఫేక్ లోన్ యాప్స్ ను నడుపుతున్నారు. ఈ లోన్ యాప్స్ ద్వారా ఎవరైనా ఓ పదివేల రూపాయల రుణం తీసుకుంటే వారిని ఈ ముఠా పీల్చిపిప్పి చేస్తుంది. పది వేలకు రూ . లక్ష కట్టినా ఒప్పుకోరు. మార్ఫింగ్ ఫోటోలు.. ఇతర పద్దతుల ద్వారా బ్లాక్ మెయిల్ చేసి ఎంత కడితే అంత కట్టించుకుంటూనే ఉంటారు. కడియం పోలీసులు దర్యాప్తు చేసిన కేసులో బాధితుడు మే ఐదో తేదన ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి లోన్ యాప్స్ నిర్వాహకులు, ఏజెంట్ల వేధింపులే కారణం. నిందితుల్ని పట్టుకున్న తర్వాత వారి బ్యాంకు లావాదేవీల్ని చూసిన పోలీసులు ఆశ్చర్యపోయారు. ఎందుకంటే కనీసం కోటి రూపాయల మేరకు రోజుకూ లావాదేవీలు జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా అనేక మంది వీరి బాధితులు ఉన్నట్లుగా గుర్తించారు.

# హస్తినకు చేరిన రాజస్థాన్ వ్యవహారం

**జైపూర్:**

రాజస్థాన్ కాంగ్రెస్ పంచాయతీ ఢిల్లీకి చేరింది. సీఎం అశోక్ గెహ్లాట్, ,మరో సీనియర్ సచిన్ పైలట్ మధ్య రాజకీయ వివాదాలు తీవ్రంగా మారాయి. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో అశోక్ గెహ్లాట్ భేటీ కానున్నారు. ఆ తర్వాత విడిగా సచిన్ పైలట్ కూడా సమావేశం కానున్నారని తెలుస్తోంది. తాను చేసిన మూడు ప్రధానమైన డిమాండ్లను ఈనెలాఖరులోపు పరిష్కరించకుంటే రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించిన సచిల్ పైలెట్.. అశోక్ గెహ్లాట్ సర్కార్ కు అల్టిమేటం జారీ చేశారు. సచిన్ పైలట్ గెహ్లాట్ కు వ్యతిరేకంగా సీరియస్ గా రాజకీయాలు చేస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఐదురోజులపాటు పాదయాత్ర చేశారు. తమది కూడా 40శాతం కమిషన్ ప్రభుత్వమేనని రాజస్థాన్‌లో గెహ్లాట్ కూడా 40 శాతం కమిషన్ సర్కార్ నడిపిస్తున్నారని పైలట్ వర్గానికి చెందిన ఓ మంత్రి చేసిన ఆరోపణ సంచలనం అయింది. కమిషన్ అప్పజెప్పనిదే ఫైళ్లు ముందుకు కదలడం లేదని విమర్శించారు. పైలట్ చేపట్టిన పాదయాత్రలో ఆరోపణలు చేసిన మంత్రి సహా 15 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తాము పార్టీ విడిచివెళ్లిపోవాలని గెహ్లాట్ అనుకుంటున్నారని, కానీ పార్టీలోనే కొనసాగుతామని, మీ వెంటే ఉంటామని ఎమ్మెల్యేలు పైలట్‌కు మద్దతు పలికారు. గత బీజేపీ ప్రభుత్వం అంటే వసుంధర రాజే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అవినీతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని పైలెట్ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా.. రాజస్థాన్ కాంగ్రెస్ లో నాయకుల మధ్య విబేధాలను పరిష్కరించాలని అధిష్టానం సీరియస్ గా దృష్టి సారించింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలందరినీ ఒకే వేదికపై తీసుకురావాలని అన్ని ప్రయత్నాలు చేస్తోంది. గతంలోనూ ఓ సారి సచిన్ పైలట్ తిరుగుబాటుకు ప్రయత్నించారు. కొంత మంది ఎమ్మెల్యేలు ఆయన వెంట వెళ్లారు. అయితే ప్రభుత్వం పడిపోయే పరిస్థితి లేకపోవడంతో మళ్లి తిరిగి వచ్చారు. తర్వాత కేబినెట్ ను మార్చి.. వారి మధ్య సయోధ్య చేశారు. అయితే ఇప్పుడు త్వరలో ఎన్నికలు జరగనున్నందున మరోసారి సచిన్ పైలట్ తన మార్క్ రాజకీయం చేస్తున్నారు . అయితే గెహ్లాట్ మాత్రం.. పైలట్ నమ్మకస్తుడు కాదని ఆయనను మాత్రం నమ్మవద్దని హైకమాండ్ కు చెబుతున్నారు. నిజానికి గెహ్లాట్ ను కాంగ్రెస్ అధ్యక్షుడ్ని చేయాలనుకున్నారు. కానీ సీఎం పదవిని వదులుకుంటే పైలట్ కు చాన్సిస్తారని ఆయన వెనుకడుగు వేశారు.

# సోషల్ మీడియాలో బీజేపీ ఫస్ట్ లిస్ట్..

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించాలని దృఢ నిశ్చయంతో ఉన్న బిజెపి ఈసారి అభ్యర్థులను ముందుగానే ఖరారు చేస్తూ ప్రజాక్షేత్రంలో ముందునుంచి తిరిగేలా చెయ్యాలని భావిస్తోంది. ఈమేరకు సర్వేలు చేస్తూ ప్రజల మద్దతు పొందుతున్న అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడింది. అయితే తాజాగా సోషల్ మీడియాలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా అంటూ ఒక జాబితా వైరల్ అవుతోంది. అందులో 25 నియోజకవర్గాలకు, 25 మంది అభ్యర్థులను బిజెపి ఖరారు చేసినట్టు, అభ్యర్థుల పేర్లతో సహా లిస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లిస్టు ఏ నియోజకవర్గం నుంచి, ఎవరెవరు పోటీ చేస్తున్నారు అన్నది ఆసక్తికర చర్చకు కారణంగా మారింది. 25 మందితో బిజెపి మొదటి లిస్ట్ అని ప్రచారం అవుతున్న లిస్టులో పాలమూరు నియోజకవర్గం - జితేందర్ రెడ్డి గద్వాల నియోజకవర్గం- డికె అరుణ కరీంనగర్ నియోజకవర్గం - బండి సంజయ్ కుమార్ అంబర్ పేట్ నియోజకవర్గం - కిషన్ రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గం - డా. లక్ష్మణ్ నిజామాబాద్ నియోజకవర్గం - అరవింద్ హుజూరాబాద్ నియోజకవర్గం- ఈటల రాజేందర్ దుబ్బాక నియోజకవర్గం- రఘునందన్ రావు మునుగోడు నియోజకవర్గం- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేవెళ్ళ నియోజకవర్గం - కొండా విశ్వేశ్వర్ రెడ్డి .. వికారాబాద్ నియోజకవర్గం - చంద్రశేఖర్ వరంగల్ (తూర్పు) నియోజకవర్గం - ఎర్రబెల్లి ప్రదీప్ రావు భూపాలపల్లి నియోజకవర్గం - కీర్తి రెడ్డి పరకాల నియోజకవర్గం- డా. కాళీ ప్రసాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం- కూన శ్రీశైలం గౌడ్ స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం - డా. విజయ రామారావు వర్ధన్నపేట నియోజకవర్గం- కొండేటి శ్రీధర్ ఉప్పల్ నియోజకవర్గం- ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్ భువనగిరి నియోజకవర్గం- జిట్టా బాల కృష్ణారెడ్డి గోషామహల్ నియోజకవర్గం - రాజాసింగ్ నారాయన్ ఖేడ్ నియోజకవర్గం - సంగప్ప నిర్మల్ నియోజకవర్గం - ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేములవాడ నియోజకవర్గం - తుల ఉమ ఎల్లారెడ్డి నియోజకవర్గం- ఏనుగు రవీందర్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గం - రేవూరి ప్రకాశ్ రెడ్డి లు ఎన్నికల బరిలోకి దిగుతారని చర్చ జరుగుతుంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ లిస్టు బీజేపీ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ లిస్టు ఎవరు వైరల్ చేస్తున్నారన్నది చర్చనీయాంశం అవుతుంది. అయితే ఆయా నియోజక వర్గాలలో మాత్రం అభ్యర్థిపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. ఇది నిజంగానే బిజెపి తయారు చేసిన లిస్టు నా.. లేక బీజేపీ దీనిపై జనాలు ఏమనుకుంటారో అని తెలుసుకోవడానికి వదిలిన ఫీలర్ నా అన్నది తెలియాల్సి ఉంది.

# ఏపీలో ఫ్లెక్సీ వార్

**ఒంగోలు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ-జనసేన మధ్య ఫ్లెక్సీ యుద్ధం నడుస్తూ ఉంది. ఓ వైపు సోషల్ మీడియాలో వైసీపీ-జనసేన మధ్య మాటల యుద్ధం నడుస్తూ ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ పార్టీల మధ్య ఫ్లెక్సీల యుద్ధం నడుస్తోంది. వైసీపీ వచ్చే ఎన్నికల్లో సోలోగా పోటీ చేస్తూ ఉండగా.. జనసేన ఎవరి తరపున పోరాడుతుందో తెలియని పరిస్థితి. వైసీపీకి వ్యతిరేకంగా వచ్చే ఓట్లను చీల్చమని జనసేనాని పవన్ కళ్యాణ్ ఇది వరకే స్పష్టం చేయగా.. తాము ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేక కొందరు దుర్మార్గులు చేతులు కలిపారంటూ సీఎం జగన్ మోహన్ రెడ్డి విమర్శలు చేస్తూ ఉన్నారు. ఇన్ని రోజులూ మాటలకే పరిమితమైన ఈ గొడవలు కాస్తా.. ఇప్పుడు ఫ్లెక్సీ వార్ కు కారణమయ్యాయి. పేదలకి పెత్తందారు. లకి మధ్య జరిగే యుద్ధం' పేరుతో రాష్ట్రంలో వైసీపీ ఏర్పాటు చేస్తున్న పెక్సీల పట్ల జనసేన వర్గాల నుండి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమగోదావరి, గుంటూరు, విశాఖపట్నం, ప్రకాశం జిల్లాల్లో వైసీపీ ఈ ఫ్లెక్సీలు వైసీపీ ఏర్పాటు చేయగా.. ఈ ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరుతూ జన సేన నాయకులు ఆందోళన చేపట్టారు. విశాఖపట్నం సిటీలో వైసీపీ ఫ్లెక్సీలకు ధీటుగా జనసేన నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రాక్షస పాలన అంతం..ప్రజా పాలన ఆరంభమంటూ జనసేన నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జగన్ ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో వివేకా మొండెం ఉండేలా ఫ్లెక్సీలను తయారీ చేయించారు. జగన్ షర్ట్‌పై 6093 నంబర్, వైసీపీ నేతలతో కూడిన జగన్ ఫ్లెక్సీని జనసేన ఏర్పాటు చేసింది. సిరిపురం వీఐపీ రోడ్‌లో పక్కపక్కనే ఇరువర్గాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇక విజయవాడలోనూ విజయవాడ పటమట సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా ఫ్లెక్సీ వార్ నడుస్తోంది. విగ్రహం చుట్టూ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల ఏర్పాటుపై వివాదం రేగింది. ఎన్టీఆర్, సీఎం జగన్, మాజీ మంత్రి దేవినేని నెహ్రూ, దేవినేని అవినాష్ , కడియాల బుచ్చిబాబు ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నందమూరి తారక రామారావు శత జయంతి నీరాజనాలు అంటూ ఫ్లెక్సీలు చుట్టూ వెలిశాయి. ప్రశాంతంగా ఉన్న విజయవాడలో రెచ్చగొట్టే చర్యలకు దేవినని అవినాష్ పాల్పడుతున్నారని టీడీపీ శ్రేణుల ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఫ్లెక్సీలను ఎవరూ తొలగించకుండా పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవినేని అవినాష్ తీరుపై విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవినేని నెహ్రూకు ఎన్టీఆర్‌తో అనుబంధం ఉన్న మాట వాస్తవమని.. నెహ్రూ పసుపు జెండా పార్థీవ దేహం మీద కప్పించుకున్నారన్నారు. చంద్రబాబు అనాడు స్వయంగా పార్టీ జెండా కప్పారని.. కానీ నెహ్రూ కుమారుడు దేవినేని అవినాష్ చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ కార్యాలయం పై దాడి చేయించారని.. పార్టీ జెండాను కింద వేసి తొక్కారన్నారు. హెల్త్ యూనివర్శిటీకి ఎన్టీఆర్ పేరు తొలగిస్తే అవినాష్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. టీడీపీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగే ఎన్టీఆర్ విగ్రహం దగ్గర వారి ఫ్లెక్సీలు ఎందుకని ప్రశ్నించారు. ధన బలం, రౌడీయిజంతో ఏమైనా చేయొచ్చంటే.. తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. విజయవాడలో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయొద్దని.. పోలీసు అధికారులకు చెప్పినా తమ వల్ల కాదని చేతులెత్తేశారన్నారు. ఇటువంటి చర్యలు పోలీసులు కంట్రోల్ చేయక పోవడం దారుణమని.. దేవినేని అవినాష్ కూడా ఒకసారి ఆలోచించాలన్నారు. ఇటువంటి చర్యలు ద్వారా వారి గొయ్యి వారే తవ్వుకుంటున్నారన్నారు. ఇప్పుడు అయినా మారకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్టీఆర్ అందరికీ ఆరాధ్య దైవం అన్నార దేవినేని అవినాష్. ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ లలితకళ అవార్డును సినీ నటులు పోసాని కృష్ణమురళికి ప్రధానం చేస్తామని.. ఎన్టీఆర్, వైఎస్సార్ అంటే తన తండ్రి నెహ్రూకి ఎంతో అభిమానం అన్నారు. టీడీపీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ పేరు కూడా ప్రస్తావన రాకుండా చేసేవారన్నారు.

# పండగలా వాలంటీర్లకు, ఘనంగా సన్మానం

**బద్వేలు**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయన మానస పుత్రిక వాలంటీ వ్యవస్థ విజయవంతంగా సాగుతూ రాష్ట్రంలో ముందు సాగుతోంది వాలంటీర్ వ్యవస్థ ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా నిలిచి ప్రతి ఇంటిలోని చిన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తూ రాష్ట్ర అభివృద్ధికి వాలంటరీ వ్యవస్థ తోడ్పడుతుందని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. బద్వేల్ మున్సిపాలిటీలోని మున్సిపల్ సభ భవనంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు వాలంటరీ వ్యవస్థలో ప్రతిభను కనపరిచిన వాలంటీర్లకు సేవా మిత్రా, సేవ రత్న, సేవ వజ్రా, అవార్డులను బహరించి శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు ద్వారా నెరవేరింద నీ, గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో నెరవేరిందని అన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి పట్టుకొమ్మలని ప్రతి చిన్న విషయాన్ని ప్రభుత్వానికి చేర్చి అభివృద్ధి కి తోడ్పడుతున్నారని అన్నారు. వృద్ధులు వికలాంగులు పెన్షన్లు వాలంటీర్ల ద్వారా తెల తెల్లవారకముందే లబ్ధిదారులు నిద్ర లేపి మరీ అందజేయడంతో లబ్ధిదారుల ముఖములో చిరునవ్వు కనిపిస్తుందని అన్నారు. దేశంలోనే ఈ రాష్ట్రంలో ప్రవేశపెట్టని అద్భుతమైన పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ఒక విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని పేర్కొన్నారు. కులమతాలకు, పార్టీలకతీతంగా నిస్వార్థంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ యద్దారెడ్డి, చైర్మన్ ఎర్రగుళ్ల గోపాలస్వామి బద్వేలు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ అధికారులను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్ :**

సూర్య, కీర్తి సురేష్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రలుగా నటించిన సినిమా 'గ్యాంగ్'. ఈ సినిమాలో నకిలీ ఐడీలు సృష్టించి.. తాము ఆదాయపు పన్ను శాఖ అధికారులమంటూ సోదాలు చేపడతారు ఈ దొంగల ముఠా. సేమ్ అదే సీన్ తరహాలో జరిగింది సికింద్రాబాద్‌లో. శనివారం పట్టపగలు తాము ఐటి అధికారులమంటూ చెప్పి ఓ గోల్డ్ షాపులోకి వెళ్లి తనిఖీలు చేపట్టింది ఓ గ్యాంగ్. అనంతరం రెండు కేజీల బంగారు నగలతో ఉడాయించింది. ఆ గ్యాంగ్ ను పోలీసులు ?రెస్ట్ చేశారు. సికింద్రాబాద్ లోని పాట్ మార్కెట్ బంగారు దుకాణంలో జరిగిన దోపిడీ ఘటనలో చోరీకి పాల్పడిన నిందితులు జాకీర్, రహీమ్, ప్రవీణ్, అక్షయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన అనంతరం నిందితులంతా మహారాష్ట్రకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడకు వెళ్లి వారిని పట్టుకున్నారు. మరో నలుగురి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు. దోపిడీకి పాల్పడిన ముఠాలో మొత్తం 8 మంది ఉన్నట్లు సమాచారం. నాలుగు నెలల క్రితమే మహారాష్ట్రకు చెందిన రివెన్ మధుకర్ ఈ షాపును పెట్టాడని, మధుకర్ సొంతూరు వెళ్లగా..షాపును బావమరిదికి అప్పగించిన సమయంలో ఈ ఘటన జరిగింది. సోషల్ మీడియా ప్రభావమో, సినిమా ప్రభావమో కానీ.. ఈ దొంగతనాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. వీరి ఆగడాలు మాత్రం రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మారు వేషాల్లో దర్జాగా వచ్చి దోచుకుంటున్నారు. నకిలీ పోలీస్ ఆఫీసర్లు, అధికారులు, దొంగ బాబా వేషాలు వేసి.. సినిమా రేంజ్‌లో నటించి దోపిడీలకు పాల్పడుతున్నారు. చివరకు వచ్చింది నకిలీ అధికారులు అని తెలుసుకుని.. లబోదిబో మంటున్నారు. ఇవే సినిమాలకు ప్రేరణ అవుతున్నాయో, సినిమాలను చూసి ఇలా తయారయ్యారో తెలియడం లేదు. అచ్చంగా ప్రొఫెషనల్స్ మాదిరిగా వ్యవహరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. తాము ఐటి అధికారులమనీ, బంగారం కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారన.. కొంచెం సేపు తనిఖీ చేస్తున్నట్లు నటించి..విలువైన వస్తువులతో ఉడాయిస్తున్నారు. సాధారణంగా ఐటీ అధికారులు నేరుగా సోదాలు చేయరు. ముందుగా నోటీసులు ఇస్తారు. కానీ అలాంటి నోటీసులేమీ రాకపోవడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. సొమ్ములు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు రావాలని తీసుకెళ్లిపోతున్నారు. బాధితులు స్టేషన్ వద్దకు వెళ్తే కానీ దొంగతనం జరిగిందని గుర్తించలేకపోతున్నారు బంగారు దుకాణాలు, ఇతర చోట్ల అత్యధికంగా లెక్కలోకి రాని వ్యవహారాలు జరుగుతూ ఉంటాయి. దీంతో బంగారం లేదా.. ఇతర నగదు దోచుకుంటే వారు పోలీసులకు ఫిర్యాదు చేయరన్న అభిప్రాయం ఉంది. అందుకే దొంగలు ఇలాంటి వ్యాపారుల్ని టార్గెట్ చేస్తారని అంచనా వేస్తున్నారు

# వైసీపీ నాయకులు రెచ్చగొట్టే పనులు మానుకోవాలి

**ఎమ్మిగనూరు**

మంగళవారం పట్టణంలో పేదలకు పెత్తందారులకి మధ్య జరిగే యుద్ధం అని పేరుతో వైసీపీ నాయకుల వేయించిన ఫ్లెక్సీలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మెగా అభిమానులు మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రేఖా గౌడ్ అన్నారు. వైసీపీ వారు వేసిన బ్యానర్లకు నిరసనగా సోమప్ప సర్కిల్ నందు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్సై మస్తాన్ వల్లి, కి మరియు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కి ఫ్లెక్సీలు తొలగించాలని వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా రేఖ గౌడ్ మాట్లాడుతూ ఫ్లెక్సీలు పర్యావరానికి హానికరం అంటూ ఫ్లెక్సీలు నిషేధం అనే జీవో విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు ఇలాంటి ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల మెగా అభిమానులను జనసైనికులను అనవసరంగా రెచ్చగొడుతున్నారని ఇలాంటి ఫ్లెక్సీల వల్ల ఎలాంటి ఉపయోగం ఉన్నదని ఈ ఫ్లెక్సీలు మీద పెట్టే దృష్టి పాలనపై పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే విషయంపై పెట్టాలని 45 ఏళ్ల అయినా వితంతులకి పెన్షన్ ఇచ్చే విషయంపైనా దృష్టి పెట్టాలని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఫ్లెక్సీలు మళ్ళీ ముద్రిస్తే అందుకు దీటుగా జనసేన కూడా ఫ్లెక్సీలు ముద్రిస్తుందని ఆతర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసా రవి ప్రకాష్, రాహుల్ సాగర్, కర్ణం రవి, బజారి, షబ్బీర్, ప్రసాద్, రాము, రషీద్, మల్లి, అక్బర్, నవాజ్, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు గుర్రాలకే సీట్లు

**హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారాన్ని చేపట్టాలని భావిస్తున్నారు సీఎం కేసీఆర్. ఈ క్రమంలో ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా ఎన్నికలకు ఎలా వెళ్లాలి అన్న దానిపై అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఈసారి టికెట్లు ఎవరికి ఇస్తే గెలుస్తారు అన్న దానిపైన కూడా సర్వేలు చేయించి, గెలుపు గుర్రాల కు మాత్రమే టికెట్లు ఇవ్వాలని కెసిఆర్ నిర్ణయించారు. ఈసారి ఎన్నికలలో కొత్త, యువ అభ్యర్థులను బరిలోకి దింపి ప్రయోగాలు చేయడం సీఎం కేసీఆర్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. ప్రజాక్షేత్రంలో మంచి పేరు, అనుభవం ఉన్న నాయకులకు పెద్దపీట వేసి టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం బీఆర్ఎస్ పార్టీలో చాలామంది నేతలకు మింగుడు పడడం లేదు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు ప్రజలు ఆదరించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి చాలామంది కీలక నాయకులు తమ వారసులకు టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈసారి వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని సీఎం కేసీఆర్ తేల్చి చెప్పారు.అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ను కోరగా, కెసిఆర్ ఈసారికి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాత్రమే పోటీ చేయాలని తేల్చి చెప్పారని సమాచారం. ఈసారి వారసులకు టిక్కెట్లు ఇచ్చే ఆలోచన లేదని ఆయన స్పష్టంగా చెప్పడంతో తమ పిల్లలకు టికెట్ కావాలని ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు ఖంగు తిన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు ఈ సారి తమ వారసులకు టికెట్ ఇవ్వాలని అధినేత దృష్టికి తీసుకు వెళ్నారు. ఈ క్రమంలో పలువురికి సీఎం కేసీఆర్ వారసులకు ఈ సారి ఎన్నికల్లో నో ఛాన్స్ అని తేల్చి చెప్పేసినట్టు సమాచారం. కెసిఆర్ నిర్ణయంతో ఈసారి ఎన్నికలలోనైనా తమ వారసులని రాజకీయాల్లోకి దింపాలని ప్రయత్నం చేస్తున్న పలువురు కీలక నేతలకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయింది

**15 మంది ఎవరు...**

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి.. హ్యాట్రిక్ ను అందుకోవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తూ ఉంది. ముఖ్యంగా అభ్యర్థుల విషయంలో చాలా ప్రణాళికలను రచిస్తూ ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ దూకుడుగా వ్యవహరిస్తూ ఉన్నారు. సర్వేలు, నిఘా వర్గాల సమాచారం తీసుకుని సీఎం కేసీఆర్ అభ్యర్థులకు సంబంధించి మార్పులు చేయాలని భావిస్తూ ఉన్నారు. 'మీ అంతట మీరు పొర పాట్లు చేస్తే తప్పు.. ఈసారి ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే లెవరినీ మార్చే ఉద్దేశం లేదు' అంటూ సీఎం ఇటీవల చెప్పారని తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని కూడా సీఎం కేసీఆర్ పరిశీలిస్తూ ఉన్నారు. పనితీరు సరిగా లేని వారిని ఆయన పిలిచి హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి పెట్టని వాళ్లపై కేసీఆర్ ఓ కంటకనిపెడుతూ ఉన్నారు. నియోజకవర్గంలో ఉండకుండా.. ఎక్కువ కాలం బయటే గడుపుతున్న వాళ్లను ఆయన పిలిచి మరీ మందలించినట్లు తెలుస్తోంది. తీరు మార్చుకోకుంటే నిర్ణయం మరోలా ఉంటుందని సీఎం ఇప్పటికే కొందరికి పిలిపించి చెప్పినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఓ15 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల విషయంలో ప్రజలు ఏ మాత్రం ఆసక్తి కనబరచలేదని కేసీఆర్ కు సమాచారం రావడంతో వాళ్లను పక్కన పెట్టేయాలని కేసీఆర్ భావిస్తూ ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తన నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి సారించక పోవడంతో ఆయన్ను హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన కొందరి విషయంలో కూడా కేసీఆర్ దూకుడుగా వ్యవహరిస్తూ ఉన్నారు. స్థానికంగా పట్టు లేకపోతే కష్టమే అని ఆ నాయకులకు కేసీఆర్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో కొందరు నాయకులు తమ కుమారులకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా లేరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పలువురు బడా నాయకులు తాము మాత్రమే కాకుండా.. తమ కుమారులకు కూడా టికెట్లు ఇవ్వాలని కోరారని.. అందుకు కేసీఆర్ ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఆయా నాయకులు తప్పుకుని తమ కుమారులను గెలిపించుకోవాలని అనుకుంటే మాత్రం ఆలోచించి నిర్ణయం చెబుతామని చెప్పినట్లు కూడా విశ్వసనీయ వర్గాల సమాచారం. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తన కుమారుడి కోసం ప్రయత్నించగా.. కుదరదని అధినేత చెప్పినట్లు తెలిసింది. ఇలా పలువురు నాయకులు తమ వారసుల విషయంలో బీఆర్ఎస్ అధినేత వద్ద చెప్పుకొన్నారు.. కానీ ఆయన నుండి గ్రీన్ సిగ్నల్ అయితే రాలేదు.

# కాంగ్రెస్ గూటికే జూపల్లి, పొంగులేటీ ?

**హైదరాబాద్ :**

తెలంగాణ సీనియర్ రాజకీయ నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఏ పార్టీలో చేరుతారన్నదానిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఈటల, పొంగులేటి, జూపల్లి రహస్య భేటీ నిర్వహించారు. గన్‌మెన్లను కూడా తీసుకెళ్లకుండా ఈటల జూపల్లి, పొంగులేటితో ఏం చర్చించా రనన్న అంశంపై ఉత్కంఠ రేపుతోంది. మరో వైపు కాంగ్రెస్ కూడా ఈ ఇద్దరిని హస్తం గూటికి చేర్చేందుకు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేసింది.. దీంతో ఏ పార్టీలో చేరాలనే విషయంలో ఈ ఇద్దరు నేతలు మల్లగుల్లలు పడుతున్నారు. అసెంబ్లి ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో నిలపాలనే పట్టుదలతో బీజేపీ నాయకత్వం ఉంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో అసం తృప్తి నేతలే టార్గెట్‌గా ఆ పార్టీ ప్రయ త్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లాలో బలమైన నేత , మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, మహబూబ్‌నగర్ జిల్లా రాజకీ యాల్లో కీలక నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును ఎలాగైనా బీజేపీలోకి తీసుకు రావాలన్న పట్టుదలతో బీజేపీ ఉంది. అయితే బీజేపీలో చేరే విషయమై పొంగులేటి, జూపల్లి తేల్చకపో వడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకునేలా బీజేపీ పావులు కదుపుతోంది. హైకమాండ్ నుంచి వచ్చిన సూచనల మేరకు పొంగులేటి, జూపల్లితో ఈటల సమావేశం అయినట్లుగా చెబుతున్నారు. అలా అయితే అందులో రహస్యం ఎందుకని కొంత మంది డౌట్. పొంగులేటి, జూపల్లి కొత్త పార్టీ పెట్టబోతున్నా రని, ఆ క్రమంలోనే ఈటల వారితో రహస్య భేటీ జరిపినట్లు మరో ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్త నేతల చేరికలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. కొత్త నేతల చేరడం అటుంచితే పార్టీ లో ఉన్న నేతలు కూడా చేజారే ప్రమాదముందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఈటలపై బీజేపీ శ్రేణుల్లోనే అనుమానాలు నెల కొనడంతో పొంగులేటి, జూపల్లితో జరిగిన చర్చల్లో వారిని బీజేపీకి ఆహ్వానించే అంశాన్ని చర్చించారా..? లేక బీజేపీలోకి రావడంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో పరోక్షంగా ప్రయోజనం కలిగించే ప్రత్యామ్నాయాలపై ఈటల వారితో చర్చించారా..? అని కొంత మంది బీజేపీ రాష్ట్ర నేతలు అనుమానపడుతున్నతమ నిర్ణయాన్ని పొంగులేటి, జూపల్లి ప్రకటించకపోవడంతో వారి రాజకీయ వ్యూహంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఉమ్మడి శత్రువైన బీఆర్ఎస్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించడాని బీజేపీ దగ్గరున్న వ్యూహాలు, తెలంగాణలో బీజేపనీకి ఉన్న బలం, ప్రజల్లో ఆదరణ, ఎన్ని సీట్లలో గెలుపు సాధ్యం తదితర అంశాలపై పొంగులేటి, జూపల్లి కి అనుమానాలున్నాయి. కాంగ్రెస్ కు గ్రామ గ్రామాన క్యాడర్ ఉండటంతో పాటు కర్ణాటక ఎన్నికల తర్వాత ఓ వేవ్ వచ్చింది. ఈ కారణంగా ఆ పార్టీ వైపు చూసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.రేవంత్ రెడ్డి వారు వస్తారని గట్టి నమ్మకంతో ఉన్నారు.

**ఈటెల నిర్వేదం**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఇద్దరూ బీజేపీలో చేరడం కష్టమేనని.. బిజెపి రాష్ట్ర చేరికల కమిటీ ఛైర్మన్ ,హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు..హైదరాబాద్ లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సంసందర్భంగా ఆయన వారితో చర్చల గురించి వివరించారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉంది. బిజెపి లేదు. పొంగులేటి, జూపల్లితో నేను రోజూ మాట్లాడుతున్నాను. వారే నాకు రివర్స్ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బిజెపిలో చేరేందుకు వారికి కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరకుండా మాత్రమే ఆపగలిగానని.. కానీ బీజేపీలోకి తీసుకు రాలేకపోయానని ఈటల చెప్పుకొచ్చారు. దీంతో పొంగులేటి, జూపల్లి ఇద్దరూ కూడా కాంగ్రెస్ లో చేరనున్నట్లు పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లయింది..బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుని.. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఆకర్షిస్తున్నాయి. ఖమ్మంలో కాస్తో కూస్తో బలం ఉన్న ఆ ఇద్దరిని తమ జట్టులో కలుపుకోడానికి ఉబలాటపడుతున్నాయి. అయితే బీజేపీ నుంచి ఈటల ఓ అడుగు ముందుకేశారు. నేరుగా తానే వెళ్లి రెండుసార్లు వారిద్దరితో చర్చించారు. కానీ వర్కవుట్ కావడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూపల్లి.. ఎవరికి వారే బాగా పట్టున్న నేతలుకావడంతో వారిద్దరినీ పార్టీలో చేర్చుకోవటం వల్ల వచ్చే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నాయకత్వం చాలా ఆఫర్లు ఇచ్చినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అప్పటికప్పుడు జెండా కప్పుకోకుండా కర్ణాటక ఎన్నికల ఫలితాల వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని ఈటల బృందానికి పొంగులేటి హామీ ఇచ్చారు. బీజేపీకి వ్యతిరేక ఫలితం రావడంతో ఇక బీజేపీలో చేరిక గురించి మర్చిపోయారు. ఫలితాల తర్వాత మాత్రం కాంగ్రెస్ వైపే పొంగులేటి , జూపల్లి అడుగులు కూడా పడుతున్నాయన్న ప్రచారం జరిగింది., కాంగ్రెస్‌కే జై కొట్టాలని ఇద్దర నేతల అనుచరులు కూడా పట్టుబడటంతో ఆ మేరకు తుది నిర్ణయానికివచ్చినట్టు సమాచారం. వాస్తవానికి ఇంతకు ముందే ఇద్దరూ కాంగ్రెస్ జెండా కప్పుకోవాలి. ప్రియాంక గాంధీ హైదరాబాద్ పర్యటనలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని అనుకున్నారు. అయితే అప్పట్లో బీజేపీ నేతలు వత్తిడి తీసుకురావడంతో ఆలోచన వాయిదా పడ్డప్పటికీ ఇక ఇదే ఫైనల్ డెసిషన్ అంటున్నారని అంటున్నారు. జూపల్లి, పొంగులేటి మాత్రమే కాదు బీజేపీలో చేరాలని చాలా మంది నేతలు ఉత్సాహపడుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# కమాన్ పూర్ లో ఘనంగా ఎమ్మెల్యే శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**కమాన్ పూర్**

ఈ రోజు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జనహృదయనేత మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఏఐసీసీ సెక్రెటరీ మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదినం వేడుకలు కమాన్ పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.సందర్భంగా కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయములో కేక్ కటింగ్ చేసి అనంతరం కమాన్ పూర్ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు పండ్ల పంపిణీ చేశిన కాంగ్రెస్ నాయకులు.అనంతరనీ యూత్ కాంగ్రెస్ అధ్వర్యములో చత్రపతి శివాజీ యువసేన వారు ఏర్పా?టు చేసిన అంబలి కేంద్రాన్ని శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా అంబలి పంపిణీ చేశారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు కుమారుడిగా శ్రీధర్ బాబు రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి తండ్రి బాటలో పయనిస్తూ ఆయన వారి ఆశయ సాధనలో భాగంగా తండ్రి చెప్పిన మాటలను స్మరించుకుంటూ ఎన్నో ఉన్నతమైన చదువులు చదివి ప్రజా శ్రేయస్సు కోసం తన జీవితాన్ని పణంగా పెట్టి మంథని ప్రజల సేవకు పరిమితమైన నాయకుడు మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అని అన్నారు.ఈ ప్రాంత బిడ్డగా ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి ఒప్పించి ఈ ప్రాంత ప్రజల నీటి అవసరాలను తీర్చడానికి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ను అందించిన నేత మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అని పేర్కొన్నారు.పేద ప్రజల ఆకలి తెలిసిన నేతగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా అమ్మ హస్తం రూ 185 పథకం రూపకల్పన చేసి శ్రీధర బాబు ప్రవేశ పెట్టారు.గల్ఫ్ మరియు ప్రవాసభారతీయుల క్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా నూతన వెబ్ పోర్టల్ రూపకల్పనను శ్రీధర్ బాబు ప్రతిపాదించరు విద్యార్థుల క్షేమం కోసం వారి ఆరోగ్యం కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మధ్యాహ్న భోజన పథకం రూపకల్పనలో భాగస్వామి అయిన నేత శ్రీధర్ బాబు అని పేర్కొన్నారు.చిన్నారుల క్షేమం కోసం వారి భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా బంగారుతల్లి పథకం రూపకల్పనలో భాగస్వామ్య మైన నాయకుడు శ్రీధర్ బాబు అని అన్నారు.మంథని నియోజకవర్గంలో చదువులకు పెద్దపీట వేసిన నాయకుడు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అని పేర్కొన్నారు అందులో భాగంగా మంథని జెఎన్ టి యు, కృషి విజ్ఞాన కేంద్రం, కాటారం లో పాలిటెక్నిక్ కళాశాల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎ నియోజకవర్గంలో కూడా నియోజవర్గం లో 2 డిగ్రీ కళాశాలలు ఉన్న దాఖలాలు లేవు కానీ మంథని లో మాత్రం రెండు కళాశాలలు తెచ్చిన ఘనత శ్రీధర్ బాబు ది అని పేర్కొన్నారు.ప్రతి మండలానికి ఇంగ్లీష్ మీడియం తో కూడిన ఆదర్శ పాఠశాలలు ఏడు మండలాలలో జూనియర్ కళాశాలలు మహదేవ్పూర్ మహాముత్తారం మండలంలో కస్తూర్బా పాఠశాలలు ప్రతి మండలంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కాటారం లో ఐటిఐ కళాశాల శ్రీధర్ బాబు నాయకత్వంలో నిర్మించబడ్డాయి అని గుర్తు చేశారుమారుమూల మంథని ప్రాంతంలో దళిత బలహీన వర్గాల ఇండ్లలో సైతం విద్యాకుసుమాలు విరబూసేనా కృషి చేసిన మహానుభావుడు మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అని కాంగ్రెస్ నాయకులు తెలియజేశారుకార్యక్రమంలో రంగు సత్యనారాయణ గౌడ్, భూనీపెల్లి రాజయ్య, ఆకుల ఓదేలు, కటకం నారాయణ తొగరి అశోక్ అన్నపూర్ణ, శేవ్వ శంకరయ్య, లింగాల కుమార్ కొంతనీ శ్రీనివాస్ సయ్యద్ ఈక్బాల్, శ్రీమూర్తి ,అబ్దుల్ రఫీక్,పెండ్యాల రాజు, ,ఎండీ అప్సర్, ముస్తాక్ రహీం ఇక్బాల్ కుక్క రవి, కోల నర్సగౌడ్, గడ్డం శ్రీను, సుమన్ సత్యం యూసుఫ్ లల్లు ,హైమద్ , ఇరుగురాల శేకర్, నునెటి మల్లికార్జున, చొప్పరి శేకర్, హర్ష ఎల్లయ్య మూదం కొమరయ్య గాజుల శ్రీనివాస్ మామిడి రాజు మనోహర్ ,అంజి,బిల్లా వెంకటేష్ , కుషన రవి,చట్ల రాయమల్లు,రాజు,ఇరుగురాళ్ల రాజు, పల్లె కనకయ్య ,సాగర్ల కొమురయ్య ,ఆకనపల్లి సుధాకర్ కుమ్మరి సాయి, వంగల విజయ్ పిడుగు మణికంఠ సిలారపు కొమురయ్య, తదితరులు ఉన్నారు

## ˜యూపీఎస్సీ సివిల్స్ లో ప్రతిభ సాధించిన శివ మారుతి రెడ్డి ని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**కోరుట్ల**



మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు అంజిరెడ్డి -పుష్పలత దంపతుల కుమారుడుశివ మారుతి రెడ్డి ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ సివిల్స్ లో 132వ ర్యాంకు సాధించిన సందర్భంగా మంగళవారం కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మారుతి రెడ్డి ని తన సొంత ఇంట్లో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించిఅభినందించి ,శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు..ఎమ్మెల్యే వెంట ఎంపీపీ తోట నారాయణ, జడ్పిటిసి దారిశెట్టి లావణ్య- రాజేష్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక సర్పంచ్ పిడుగు రాధా- సందయ్య పాల్గొన్నారు.

## ఇది ట్రైలర్ మాత్రమే...అసలైనది తర్వాత ఉంది-గంటా శ్రీనివాసరావు

**విశాఖపట్నం**

మహానాడు ఊహించిన దానికంటే విజయవంతం అయిందని.. అందరికీ కృతజ్ఞతలు అని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ... మినీ మేనిఫెస్టో ప్రజల్లో సంచలనం కలిగించిందని... వైసీపీ నేతల్లో గుబులు రేగుతోందని అన్నారు. కొంతమంది ఉక్రోషం తట్టుకోక మేనిఫెస్టోను వైసీపీ నేతలు చించివేశారని మండిపడ్డారు. టీడీపీకి మేనిఫెస్టో.. భగవద్గీత, ఖరాన్, బైబిల్ లాంటిదని చెప్పుకొచ్చారు. ఇది ట్రైలర్ మాత్రమే...అసలైనది తర్వాత ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో... మేధోమథనం జరిగిన తర్వాతే మేనిఫెస్టోనిను విడుదల చేశారని తెలిపారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో విధ్వంసపాలన జరుగుతోందన్నారు. అమ్మఒడి ఎంత మంది ఉన్నా ఇస్తామని చెప్పి... ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని విమర్శించారు. గతంలో దీపం పథకం తెచ్చిన ఘనత చంద్రబాబు దే అని... ఇప్పుడు మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారని అన్నారు. యువగళం పాదయాత్ర విజయవంతంగా జరుగుతోందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఉద్యోగాలు... నిరుద్యోగులకు వరమన్నారు. బీసీలకు ఒక రక్షణ చట్టం.. ఇంటింటింటికి మంచి నీరు చాలా మంచి పథకాలు అని ఆయన చెప్పుకొచ్చారు.

## శ్రీశైలం మల్లన్న సేవలో మంత్రి హరీష్ రావు

**శ్రీశైలం**

శ్రీశైలం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవార్లను తెలంగాణ మంత్రి హరీష్ రావు దర్శించుకున్నారు ముందుగా శ్రీస్వామి అమ్మవారి దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న తెలంగాణ మంత్రి హరీష్ రావుకు ఆలయ అర్చకులు నుదిటిని విభూది తిలకం దిద్దగా ఈఓ లవన్న అధికారులు సాదరంగా స్వాగతం పలికారు ఆలయ రాజగోపురం ముందు ఉన్న ధ్వజస్తంభానికి మంత్రి హరీష్ రావు నమస్కరించారు అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి హరీష్ రావుకు ఆలయ అర్చకులు,వేదపండితులు ఆశీర్వచన చేసి శ్రీస్వామి అమ్మవార్ల లడ్డులు తీర్థ ప్రసాదాలను అందజేశారు దర్శనంతరం క్షేత్ర పరిధిలో నూతనంగా నిర్మించిన ఓ ప్రైవేటు సత్రం ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్ రావు పాల్గొననున్నారు.

## ఎస్సై పేరిట బెదిరింపులు

**సిద్దిపేట**

చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఫోన్ కాల్స్‌కలకలం సృష్టిస్తున్నాయి. ఇంటర్ నెట్ సెంటర్, మినీ బ్యాంక్ నిర్వాహకులకు స్థానిక ఎస్సై ల పేరుతో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. 8639214082 నంబర్తో కాల్ చేసి నేను ఎస్ఐని మాట్లాడుతున్నా.. డబ్బులు పంపాలంటూ బెదిరింపులు వచ్చాయి. వాట్సాప్ కాల్స్ లో స్థానిక ఎస్సై ఫోటోనే అగంతకులు డీపీగా పెట్టుకున్ఆనరు. ఇటీవలే గుర్తుతెలియని వ్యక్తి పోలీసు సిబ్బంది పేరిట జిల్లాలోని పలు మీసేవా కేంద్రాల నిర్వాహకులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడి పోలీసులకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఎవరు ఫోన్ చేస్తున్నారో తెలియక షాప్ నిర్వాహకులు అందోళనలో వున్నారు.

## మోడీ హయంలో అభివృద్ది

**అనకాపల్లి**

కేంద్ర ప్రభుత్వం మోడీ 9 సంవత్సరాల పరిపాలనలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలో బిజెపి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని పలు కీలక అంశాలు వివరించారు. రానున్న కాలంలో దేశం మరింత అభివృద్ధి చెందే విధంగా మోడీ పాలన కృషిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గం ఇంచార్జ్ పట్టణ బిజెపి నాయకులు పలువురు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వర్సెస్ ఎంఐఎం

**హైదరాబాద్ :**

ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పీడ్ పెంచారు. ఇన్నాళ్లు అధికార బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచిన ఒవైసీ తాజాగా స్వరం మార్చారు. ఆదిలాబాద్ సభా వేదికగా కేసీఆర్‌ను టార్గెట్ చేయడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది. ఇన్నాళ్లు కేసీఆర్‌కు అండగా నిలిచిన అసద్ తాజాగా స్వరం మార్చడంతో ఆయన బీఆర్ఎస్‌తో కటీఫ్ అవుతున్నారా అనే చర్చ జరుగుతోంది. నిజానికి గత కొంత కాలంగా బీఆర్ఎస్‌తో ఎంఐఎంకు చెడిందనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు షాకిచ్చేలా తమకు బలమున్న నియోజ కవర్గాలన్నింటిలో పోటీకి దిగాలని మజ్లిస్ ప్రయత్నాలు చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అసద్ టార్గెట్ చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏంటనేది ఉత్కంఠ రేపుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం స్టీరింగ్ మా చేతిలో ఉందని కొందరు పదే పదే చెబుతున్నారని, స్టీరింగ్ మా చేతిలో ఉంటే కేసీఆర్ మా పనులు ఎందుకు చేయడం లేదని ఈ సందర్భంగా ఒవైసీ ప్రశ్నించారు. ముస్లింల అభివృద్ధి కోసం ఈ ప్రభుత్వం పని చేయరడం లేదని షాదీ ముబారక్ చెక్కులు సంవత్సరమైనా రావట్లేదని మండిపడ్డారు. గచ్చిబౌలిలో స్థలం ఇచ్చినా ఇప్పటి వరకు ఇస్లామిక్ సెంటర్ నిర్మాణం జరగలేదు గానీ బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని ధ్వజమెత్తారు. మసీదు కూల్చిన చోట కొత్తది ఏర్పాటు చేయలేదు కానీ కొత్త సచివాలయ నిర్మాణం పూర్తయిందన్నారు. తెలంగాణలో ఆలయాల కోసం రూ.2500 కోట్ల నిధులు ఖర్చే చేశారని ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులకు హిందూ దేవతల పేర్లు పెట్టారన్నారు. రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గంలో రామ మందిరాలు నిర్మిస్తామని చెప్పాడు. కానీ ఈ రాష్ట్రంలో ముస్లింలకు ఎలాంటి పనులు జరగడం లేదని విమర్శించారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు తన పేరు చెప్పుకోవడమే పనిగా మారిందని బీజేపీ, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మా అండదండలు ఉంటేనే ఎవరైనా ముఖ్యమంత్రి కాగలని ఈ సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కొంత కాలంగా ఎంఐఎం తీరు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది. బీఆర్ఎస్ పెట్టిన నాటి నుంచి ఎంఐఎంకు బీఆర్ఎస్‌కు మధ్య గ్యాప్ పెరిగినట్లు చర్చ జరుగుతోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మజ్లీస్ పార్టీ బీఆర్ఎస్‌కు బేషరతుగా మద్దతు తెలుపుతూ వస్తోంది. అయితే టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా ఆవిర్భవించాక అసదుద్దీన్ ఒవైసీకి కేసీఆర్‌కు మధ్య గ్యాప్ పెరిగినట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అవతరించాక అసదుద్దీన్ కనీసం శుభాకాంక్షలు చెప్పలేదు. డిసెంబర్ 9న బీఆర్ఎస్ ఆవిర్భావానికి సైతం ఒవైసీ హాజరుకాలేదు. ఢిల్లీలో జరిగిన పార్టీ కార్యాలయం ఓపెనింగ్ కార్యక్రమంలోనూ మజ్లీస్ ప్రతినిధులు కనిపించలేదు. ఈ క్రమంలో ఇటీవల అసెంబ్లీలో అక్బరుద్దీన్ మంత్రి కేటీఆర్‌తో ఏకంగా ఛాలెంజ్ చేయడం హాట్ టాపిక్ అయింది. వచ్చే ఎన్నికల్లో 50 స్థానాల్లో పోటీ చేసి 15 చోట్ల తప్పక గెలిచి అసెంబ్లీలో అడుగు పెడతానని అక్బరుద్దీన్ చేసిన సవాల్ సంచలనం రేపింది. ఇంతలో ఆయన సోదరుడు అసదుద్దీన్ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సెన్సేషన్‌గా మారాయి. అయితే అసద్ కామెంట్స్ వెనుక పక్కా వ్యూహం ఉందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలే అసద్ స్వరం మార్చడానికి రీజన్ అనే వాదన వినిపిస్తోంది. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటోంది. ఈ క్రమంలో తన వర్గం కాంగ్రెస్ వైపు మళ్లకుండా ముందస్తు వ్యూహంలో భాగంగానే అసద్ తాజాగా కేసీఆర్‌ను టార్గెట్ చేశారా అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మరి కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఎంఐఎం చీఫ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# జూన్ 7న శశికళతో మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం భేటీ

**చెన్నై:**

అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళతో మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం జూన్ 7వ తేది భేటీ కానున్నారు. ఇందుకోసం తంజావూరులోని ఓ కల్యాణ మండపంలో ఓపీఎస్ వర్గీయులు ఏర్పాట్లు చేపట్టారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణంతో అన్నాడీఎంకే నాలుగు వర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ పార్టీలోని ప్రధాన నిర్వాహకులు, కార్యకర్తలు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు ఈపీఎస్ వెంటే ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఇటీవల అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌తో ఓపీఎస్ తన వర్గానికి చెందిన నాయకులతో కలసి సమావేశమై విడిపోయిన పార్టీని ఏకం చేసేందుకు కృషి చేయాల్సిందిగా చర్చించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ఓపీఎస్ వర్గీయుల్లో ఒకరైన మాజీ ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ... జూన్ 7వ తేది తంజావూరులో మాజీ మంత్రి వైద్యలింగం కుమారుడు షణ్ముగప్రభు -యాలిని కల్యాణం ఓపీఎస్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ వివాహానికి వీకే శశికళ కూడా హాజరవుతారని, ఈ సందర్భంగా ఆమెతో ఓపీఎస్ సమావేశమై ప్రస్తుత రాజకీయాల గురించి చర్చిస్తారని ప్రభాకర్ తెలిపారు.

# ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

**వనపర్తి**



వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నూతన ఎస్పీ కార్యాలయానని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనికుమార్ తదితరులు హజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వందేళ్ల ప్రణాళికతో తెలంగాణ అభివృద్ధి చెందింది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనికి మార్గదర్శి. దేశంలోని మరే రాష్ట్రంలోనూ తెలంగాణ తరహా సచివాలయాలు లేవు. ఇతర రాష్ట్రాల సచివాలయాలు కూడా తెలంగాణ కలెక్టరేట్ల మాదిరిగా లేవని ఐఏఎస్, ఐపీఎస్ లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రాజెక్టులు కట్టినా, జల, థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ కట్టినా, రహదారులు వేసినా, కొత్త విద్యాలయాలు పెట్టినా, విశ్వవిద్యాలయాలు పెట్టినా, వ్యవసాయాన్ని అధ్భుతంగా అభివృద్ధి చేసినా భావితరాల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని చేసిందేనని అన్నారు. ఈ రోజు సర్వాంగ సుందరంగా కట్టిన ఎస్పీ కార్యాలయం చూస్తే ఎంతో సంతోషం అనిపిస్తున్నది. నూతన కార్యాలయం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి. వనపర్తి రాజభవనం మరమ్మతుకు ప్రతిపాదనలు పెట్టాం. త్వరలోనే ఆ పనిని చేపడతాం. ఇప్పుడు ఎస్పీ కార్యాలయం ఆ రాజభవనం మాదిరిగానే ఉన్నది. 250 ఎకరాలలో వనపర్తిలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు ఒకచోటే ఏర్పాటయ్యాయి. చుట్టూ ఉన్న కొండలు, అటవీప్రాంతంతో ఈ ప్రాంతం ఎంతో సుందరంగా కనిపిస్తున్నది. మెడికల్ కళాశాలను చూసి అక్కడి వైద్య విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తంచేశారు. హోంమంత్రి కుటుంబానిది హైదరాబాద్ లో తొలి డైరీ. వారిని చూసి నేను 100 బర్రెలతో వనపర్తిలో డైరీ ఏర్పాటు చేశాను.

మహమూద్ అలీ హర్యాన వచ్చి దగ్గరుండి పరిశీలించి బర్రెలు ఇప్పించారు. హైదరాబాద్ కు, వనపర్తికి ఉన్న పాల ధరల తేడా మూలంగా ఇబ్బందులు వస్తాయేమో అని ముందే హెచ్చరించారు. ఐదేళ్లు డైరీ నడిపి రూ.40 లక్షలు నష్టపోయానని మంత్రి అన్నారు.

# ఇట్లా కాలిస్తే ఎట్లా

**పెద్దపల్లి**

ప్రతినిధి వరి కొయ్యలను తగులబెడుతున్న రైతులుసారం దెబ్బతింటున్నదంటున్న శాస్త్రవేత్తలుమేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోయి పంట దిగుబడి తగ్గే ప్రమాదంపెద్దపెల్లి జిల్లా :మే30: గతంలో కొడవళ్లతో వరిని మొదళ్ల వరకు కోసేవారు. ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి రావడంతో మొదళ్ల వరకు కాకుండా 25 నుంచి 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నాయి. దీంతో గడ్డి కొయ్య కాళ్ల రూపంలో పంట అవశేషంగా మిగులుతున్నది. వీటిని రైతులు మడిలోనే తగులబెడుతున్నారు. ఇది పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్నది. కాల్చడం వల్ల అపార నష్టాలున్నాయంటూ శాస్త్రవేత్తలు పదేపదే చెబుతున్నా మెజార్టీ రైతులు వినకుండా వరి కొయ్యలను కాల్చుతూనే ఉన్నారు. తద్వారా తాను తీసుకున్న గొయ్యిలో తానే పడ్డట్లు అవుతున్నది. ఈ విధానం వల్ల ప్రకృతి దెబ్బతినడమేకాదు, అన్నదాత అన్ని రకాలుగా నష్టపోతున్నాడు. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోవడమే కాకుండా సారవంతమైన భూమి దెబ్బతినడంతో దిగుబడిపై కూడా ప్రభావం చూపుతున్నది. వాతావరణం కలుషితమవుతున్నది. అప్పట్లో దొడ్డినిండా పశువులు ఉండడం వల్ల వాటి మేత కోసం గడ్డిపోచను కూడా విడిచిపెట్టకుండా.. కొడవళ్లతో వరిని మొదళ్ల వరకు కోసేవారు. ఎండబెట్టి కుప్పవేసి ఏడాదంతా పశువులకు మేతగా ఉపయోగించే వారు. ఇప్పుడు పశువులు లేకుండా పోయాయి. రైతుకు గడ్డి అవసరం లేకుండాపోయింది. వరికోత యంత్రాలు వచ్చిన తదుపరి గడ్డిని కుప్పవేసే రైతులను వేళ్లపై లెక్కపెట్టే పరిస్థితులు వచ్చాయి. మారిన ప్రపంచీకరణ నేపథ్యంలో.. ప్రస్తుతం రైతులు వరిపంట కోతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. పంటకు, పంటకు మధ్య సమయం తక్కువ ఉండడంతో వరికోసిన తర్వాత మిగిలిన కొయ్యకాళ్లు, వరిగడ్డిని కంపోస్టుగా మార్చుకోవడంపై రైతులకు అవగాహన లేకపోవడంతో పొలంలో ఉన్న కీటకాలను, వ్యాధికారక జీవులు నశింపచేయవచ్చన్న అపోహతో చాలా మంది రైతులు వరి కొయ్య కాళ్లను, గడ్డిని తగులబెడుతున్నారు. తగులబెట్టడం వలన అనేక నష్టాలువరి కొయ్యలను తగులపెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతున్నది. ఉత్తర భారతదేశంలో ఈ కారణంగా శీతాకాలంలో తీవ్రస్థాయిలో కాలుష్య సమస్యలు ఎదురవుతున్నాయని ఇప్పటికే అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సాధారణంగా సూక్ష్మజీవులు పంటకు వేసే ఎరువులను మొక్కలకు అందిస్తాయి. కానీ కొయ్యలను తగులపెట్టడంతో అవి చనిపోవడంతో రైతులు వేసే ఎరువులు మొక్కకు అందే అవకాశం లేకుండాపోతున్నది. కొయ్యకాళ్లను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ కర్బనం, కార్బన్‌డైఆక్సైడ్‌గా మారి వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడానికి కారణమవుతున్నది. పొగ, ధూళికణాలు గాలిలో కలవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అలాగే పొలాల్లో తిరిగే ముంగిసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోతున్నాయి. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. ఇది సాగుకు ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. కలియ దున్నినా.. కుప్ప పెట్టినా.. బంగారమేవరిపంట కోసిన వెంటనే కొయ్యకాళ్లను తగులబెట్టకుండా పొలంలో మిగిలిన తేమను



ఉపయోగించుకుని దున్నాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దున్నడం వల్ల కొయ్యకాళ్లు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తద్వారా సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం వల్ల వేసవిలో నేలలో పగుళ్లు రాకపోవడం, తేమ ఆవిరి కావడం తగ్గి తొలకరిలో పడిన వర్షపునీరు నేలలోకి ఇంకిపోవడం ద్వారా నేలకోతకు గురికాకుండా ఉంటుంది. ఒక టన్ను వరి గడ్డి కావాలంటే.. ఆ వరి పెరుగుదలకు 18.9 కిలోల పోటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరంతోపాటు కొంత మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్ని తిరిగి నేలకు చేరతాయి. లేదా ఈ పంట అవశేషాల వ్యర్థాలను కంపోస్టు చేయడం ద్వారా సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవచ్చు. వానాకాలంలో దమ్ము చేసేటప్పుడు ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే నేలలో మిగిలిపోయిన వరికొయ్యలు తొందరగా కుళ్లిపోతాయి. తర్వాత నాటే వరి పంటకు నేల ద్వారా పోషకాలు అందుబాటులోకి వస్తాయి. ఈవిధానంపై ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నా, క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది

# చెరువును కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్స్ లు

**మరిపెడ:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డోర్నకల్ మండలం కొరివి మండలం బలపాల గ్రామంలో మరియు మరిపెడ మండలం దంతాలపల్లి మండలం పలు గ్రామాలలో రియాల్ట్ బరితెగిస్తున్నారు తల్లావుకల్ విలేజ్ లోని మైసమ్మ చెరువును కొందరు మట్టి పోసి లెవెల్ చేసి అమ్ముకొని ఫెన్సింగ్ వేశారు. మరోపక్క చెరువు కాలువలను పూడ్చివేసి చేలలో కలిపేసుకుంటున్నారు. చెరువు మత్తడి,తూము ధ్వంసం చేసి చెరువులో నీళ్లు నిలువకుండా చేస్తున్నారని గ్రామస్తులు కొందరు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో మరిపెడ తాసిల్దార్ రాంప్రసాద్,ఇరిగేషన్ ఆఫీసర్లు సంజీవ,నరేందర్ లు చెరువులు పరిశీలించి నిజమేనని నిర్ధారించారు. మైసమ్మ చెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో సర్వేనెంబర్ 64 లో వ్యాపించి ఉన్నదని,వర్షాలు వచ్చినప్పుడు నీళ్లు నిలిచే ప్రాంతం మొత్తం చెరువు కిందికే వస్తుందని,కొంతమంది వ్యక్తులకు ప్రైవేట్ పట్టాలు ఉన్నప్పటికీ వ్యవసాయం చేసుకోవాలి కానీ చెరువును పూడ్చడం,ఫెన్సింగ్ వేయడం,రియల్ ఎస్టేట్ అవసరాలకు వాడడం కుదరదని తేల్చి చెప్పారు. చెరువు పారకం ఎంతవరకు ఉందో నికరంగా తేల్చాలని గ్రామస్తులు కొందరు కోరడంతో త్వరలోనే టెక్నాలజీ ఆధారంగా సర్వే చేసి హద్దులు డిక్లేర్ చేస్తామన్నారు.

# ప్రపంచ దేశాలకు భారతదేశాన్ని బాస్. గా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దే

**రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**

**కర్నూలు**

ప్రపంచ దేశాలకు భారతదేశన్ని బాస్ గా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కిందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ప్రపంచాన్ని ఐదు, ఆరు దేశాలు శాసించేవని ,కానీ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించాక ఆదేశాలకు కూడా మన దేశాన్ని బాస్ గా నిలిపిన ఘనత ఆయనకే దక్కిందని వివరించారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రపంచంలో మన దేశ గౌరవాన్ని తగ్గించేలా పరిపాలించాయని, కానీ బిజెపి ప్రభుత్వం మాత్రం మన దేశ గౌరవాన్ని పెంచే విధంగా ముందుకు సాగుతుందని చెప్పారు. గత తొమ్మిది సంవత్సరాల బిజెపి ప్రభుత్వ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వివరించారు. కేవలం ఎన్నికల్లో ప్రయోజనాల కోసమే బిజెపి ప్రభుత్వాన్ని కమ్యూనల్ గా చూపించే ప్రయత్నం అనేక పార్టీలు చేస్తున్నాయని, అది సమంజసం కాదని చెప్పారు. దేశంలో మైనార్టీలకు రాజ్యాంగ ప్రకారం హక్కులు ఉన్నాయని, కానీ మెజార్టీ వర్గాలలో కూడా పేదలు ఉన్నారని వారిని కూడా ముందుకు తీసుకు వెళ్లే దిశగా బిజెపి ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే ప్రయత్నం బిజెపి ప్రభుత్వం చేస్తుందని, దీనిని కొన్ని పార్టీలు తమ స్వార్థం కోసం కమ్యూనల్ గా ముద్ర వేస్తున్నాయని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు మన సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తున్నాయని, కొన్ని ముస్లిం దేశాలలో కూడా హిందూ దేవాలయాల నిర్మాణాలను కోరుకుంటున్నాయని చెప్పారు. ప్రపంచంలోని అన్ని దేశాలకు సంస్కృతి సాంప్రదాయాలు ఉంటాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అక్కడి ప్రభుత్వాలపై ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పంచభూతాలను కూడా సమర్థవంతంగా వినియోగించుకొని దేశానికి ఉపయోగపడే విధంగా పరిపాలన చేస్తున్నారని వివరించారు. దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మన రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే నిధులను ఎక్కువగా కేటాయిస్తుందని, అయితే వీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులను



ఇతర పథకాలకు మళ్లించడం ద్వారా దుర్వినియోగం చేస్తున్నట్లు వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇచ్చే కంటే 25 శాతం అదనంగా గృహ నిర్మాణ పథకాన్ని మన రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసిందని వివరించారు. నారీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు సాయిధ దలాల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత దక్కిందన్నారు. దేశంలో 27 కోట్ల మహిళలకు రుణాలను అందజేసింది అని చెప్పారు .అలాగే యువశక్తి పథకం ద్వారా యువత అభివృద్ధికి అన్ని విధాల కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తుందని చెప్పారు .కర్నూల్ నగరంలో క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించి 90 కోట్ల రూపాయల రుణాలను బ్యాంకులో డిపాజిట్ చేసినప్పటికీ వాటిని ఖర్చు చేసి హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయడంలో విఫలం చెందారని చెప్పారు .రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు సంబంధించి అనువైన వాతావరణం లేకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే రసాయనిక ఎరువులకు సంబంధించి భారీగా సబ్సిడీలు ఇస్తుందని చెప్పారు .దేశంలో రైతులకు సంభందించీ కోటీ 33 లక్షల క్లైమ్లను పరిష్కరించిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో వేప ఆధారిత మందుల తయారీకి పెద్దపీట వేస్తుందని వివరించారు. ఒకప్పుడు వ్యాక్సిన్లను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందని, కానీ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఊహించిన విధంగా మన దేశంలో వ్యాక్సిన్ తయారు చేయించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కిందని చెప్పారు .మన దేశ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందజేయడమే కాకుండా అవసరమైన దేశాల్లో కూడా వ్యాక్సిన్ సరఫరా చేసి అన్ని దేశాల మన్న లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందుకున్నారన్నారు. మన దేశంలో సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు ఉన్నవారు ఉన్నారని, అలాంటివారు ఇతర దేశాల్లో కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం వల్లే ఆరు శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఆయా శాఖల అభివృద్ధికి సమర్థవంతంగా కృషి చేశానని చెప్పారు. ఇందుకు సంబంధించి బెస్ట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా అవార్డు అందుకున్న విషయాన్ని ఆయన వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సాధ్యంలో భవిష్యత్తులో మన దేశం మరెన్నో అద్భుతాలను సృష్టించబోతుందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు .విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు డాక్టర్ వినుషారెడ్డి, పోలంకి రామస్వామి ,కాశీ విశ్వనాథ్ ,కాలంగి నరసింహ వర్మ తదితరులు పాల్గొన్నారు .

# అల్లు శిరీష్ "బడ్డీ" ఫస్ట్ లుక్



మంచి ఆసక్తికరమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన యంగ్ హీరో అల్లు శిరీష్ ఇటీవల "ఊర్వశివో రాక్షసివో" మంచి హిట్ అందుకున్నారు. ప్రేక్షకుల నుండి ఈ మంచి రెస్పాన్స్ లభించింది. సినిమాలో నటీనటుల నటనకు ప్రశంసలు దక్కాయి.

ఇప్పుడు శిరీష్ కొత్త సినిమా మళ్లీ వార్తల్లోకి వచ్చింది. తాజా సమాచారం ఏమిటంటే, టాప్ ప్రొడక్షన్ బ్యానర్ స్టూడియో గ్రీన్‌పై శిరీష్ కొత్త చిత్రం త్వరలో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి రాబోతోంది. మేకర్స్ ఈరోజు సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్‌ని విడుదల చేసారు. రిలీజ్ చేసిన పోస్టర్‌లో అల్లు శిరీష్ తుపాకీతో కనిపిస్తుండగా, టెడ్డీ బేర్ అతని పక్కన ఫైటింగ్ పొజిషన్‌లో నిలబడి ఉంది. బడ్డీ అనే టైటిల్ తో తెరకెక్కిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. అల్లు శిరీష్ తన బడ్డీతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కెఇ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. గాయత్రి భరద్వాజ్, గోకుల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ హిప్ హాప్ తమిజా సంగీతం అందించగా, రూబెన్ ఎడిటింగ్ నిర్వహించారు. ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించబడతాయి. తారాగణం: అల్లు శిరీష్, గాయత్రి భరత్వాజ్, గోకుల్

# ద్వారకా క్రియేషన్స్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ జూన్ 2న విడుదల




సెన్సిబుల్ డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ప్రస్తుతం ద్వారకా క్రియేషన్స్ లో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మాణంలో కొత్త సినిమా చేస్తున్నారు. మిర్యాల సత్యనారాయణరెడ్డి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

జూన్ 2న సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ని విడుదల చేయనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ లో రక్తం గుర్తులతో ఉన్న చేతిని మనం చూడవచ్చు. మరో 3 రోజుల్లో టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల కానున్నాయి. ద్వారకా క్రియేషన్స్ గత చిత్రం 'అఖండ'తో సంచలన బ్లాక్‌బస్టర్ ని అందించింది. దీంతో వీరి నుంచి రాబోతున్న ప్రాజెక్ట్స్ పై భారీ అంచనాలు ఉన్నాయి. అంచనాలకు తగ్గట్టుగానే శ్రీకాంత్ అడ్డాల న్యూ ఏజ్ సినిమాతో రాబోతున్నారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తారు

# జూన్ 2 "చక్రవ్యూహం" గ్రాండ్ రిలీజ్




విలక్షణ పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "చక్రవ్యూహం' -ది ట్రాప్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రాన్ని తెరకెక్కించిన చెట్కూరి మధుసూధన్ మీడియా రిలీజ్ ప్రెస్ మీట్ లో ఎన్నో విషయాలను పంచుకున్నారు. సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీమతి. సావిత్రి గారు "చక్రవ్యూహం" ని నిర్మించారు.

డైరెక్టర్ మధుసూధన్ మాట్లాడుతూ మా "చక్రవ్యూహం" చిత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన స్వర్గీయ సూపర్ స్టార్ కృష్ణ గారిని గుర్తుచేసుకొని ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే విడుదల అయినా టీజర్ కి ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వస్తుంది అని థియేటర్స్ లో కూడా ఇదే విధంగా ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు. ట్రైలర్ విడుదల చేసిన మెగా హీరో సాయిధరమ్ తేజ్ గారికి ధన్యవాదాలు తెలిపారు. యూట్యూబ్ లో మిలియన్ వ్యూస్ తో దూసుకెళ్తుంది ఈ చిత్ర ట్రైలర్. ప్రేక్షకులు అందరిని జూన్ 2 న థియేటర్స్ లోనే సినిమా చూసి ఆదరించాలని కోరారు.

క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కిన చిత్రం లో అజయ్ ప్రధాన పాత్ర పోషించారు. ఆయన మాట్లాడుతూ, మధుసూధన్ గారు సినిమాని తీసిన తీరు తనకు ఎంతో నచ్చిందని చెప్పుకొచ్చారు. స్క్రీన్ ప్లే, కథ పై తనకి ఉన్న కమాండ్ బట్టే చెప్పుచు మధుసూధన్ గారు తన కథని ఎలా సిద్ధం చేసారో అని అన్నారు. సినిమా అందరికి నచ్చుతుందని బాగా వచ్చిందని ప్రతి ఒక్కరు తమ సినిమాని జూన్ 2 న థియేటర్స్ కి వచ్చి చూడమని కొత్త దర్శకులని ఎంకరేజ్ చేయమని అన్నారు. కొద్ది రోజుల క్రితం విడుదల అయినా విరూపాక్ష ని డైరెక్ట్ చేసిన యువ దర్శకుడు కార్తీక వర్మ దండు మరియు నేచురల్ స్టార్ నాని కి బిగ్గెస్ట్ కెరీర్ హిట్ అందించిన దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఇద్దరు కూడా తమ మొదటి చిత్రాలతో పెద్ద విజయం సాధించారు. విరూపాక్ష- కార్తీక వర్మ దండు, దసరా- శ్రీకాంత్ ఓదెల అని ఎలా చెప్పుకుంటున్నారో ఈ చిత్రం విడుదల అయ్యాక చక్రవ్యూహం- చెట్కూరి మధుసూధన్ అని కచ్చితంగా మాట్లాడుతుకుంటారని చిత్ర యూనిట్ సభ్యులు పేర్కొన్నారు.


రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా హక్కులని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ శశిధర్ రెడ్డి కొనుగోలు చేసారు. ఆయన మాట్లాడుతూ కథ వినగానే నచ్చి కొనడం జరిగింది అన్నారు. ఇప్పుడు డైరెక్టర్ గారు తీసిన సినిమా చూసాక 100 శాతం సక్సెస్ అవుతుందని చెప్పారు. నేటి కాలం యువ దర్శకులదే అని మంచి మంచి కంటెంట్స్ తో వస్తున్నారని అలాంటి వారికి అవకాశాలు ఇవ్వడానికి ఇండస్ట్రీ ఎప్పుడూ రెడీగా ఉంటుందని మరియూ ప్రేక్షకులు కూడా కొత్తదనాన్ని కోరుకుంటున్నారని అన్నారు. జూన్ 2 న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్న మా "చక్రవ్యూహం" చిత్రాన్ని థియేటర్స్ లో చూసి విజయవంతం చేయాలని కోరారు. శశిధర్ రెడ్డి గారి చేతులు మీదగా చిత్ర యూనిట్ అంతా కలిసి బిగ్ టికెట్ ని ఆవిష్కరించారు.

# భోళా శంకర్' భోళా మానియా త్వరలో ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ ల మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ "భోళా శంకర్" మోస్ట్ ఎవైటెడ్ మూవీస్ లో ఒకటి. రామబ్రహ్మం సుంకర భారీ బడ్జెట్ తో భారీ కాన్వాస్ పై రూపొందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. మేకర్స్ ఇటీవల స్విట్జర్లాండ్ లో చిరంజీవి, తమన్నా భాటియాపై పాట చిత్రీకరణను పూర్తి చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ త్వరలో ప్రారంభం కానున్నాయి. ముందుగా మ్యూజికల్ జర్నీ ప్రారంభిస్తారు. 'భోళా మానియా త్వరలో ప్రారంభమవుతుంది' అని మేకర్స్ అనౌన్స్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్ లో చిరంజీవి స్టైలిష్ గెటప్ లో రెండు చేతులను వెనుక జేబులో పెట్టుకొని చేసిన గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్ ని చూడవచ్చు. ఇక్కడ డిఫరెంట్ గెటప్స్ లో డ్యాన్సర్స్ తో పండుగ వాతావరణం కనిపిస్తోంది. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి చార్ట్‌బస్టర్ ఆల్బమ్ ని స్కోర్ చేసారు. కొంత టాకీ పార్ట్, క్లైమాక్స్ షూటింగ్, భారీ సెట్ సాంగ్ పెండింగ్ లో ఉన్నాయి. జూన్ నెలాఖరకు సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అనిల్ సుంకర ఏ కె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్ భావోద్వేగాలు, ఇతర అంశాలు సమపాళ్లలో వుంటాయి. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్ గా కనిపించనుంది. టాలెంటెడ్ యాక్టర్ సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ తరహా పాత్రలో కనిపించనున్నారు. డడ్లీ డీవోపీ గా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. భోళా శంకర్ ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది.

తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ , రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950